

# నేటి పత్రిక ప్రజా వార్త

NETI PATRIKA PRAJA VARTHA

తెలుగు వార పత్రిక

Postal License No.VJ/220/2023-25

విజయవాడ | తేదీ : 16-23 జూన్ 2025 | సంపాదకులు : కొండూరి శ్రీనివాసరావు | సంపుటి: 05 | సంచిక : 01 | పేజీలు : 4 | రూ. 5.00



TELUGU ONLINE DIGITAL NEWS PORTAL & ONLINE CHANEL

Prajavatha-Online Telugu News

http://www.prajavartha.com

వీక్షించండి .. చదవండి... చెప్పండి...


## జీ7 వేదికగా ఏఐ డీప్‌ఫేక్‌లపై ప్రధాని మోదీ ఆందోళన



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పరిజ్ఞానం వల్ల తలెత్తుతున్న సవాళ్లు, ముఖ్యంగా డీప్‌ఫేక్‌ల వ్యాప్తిపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కెనడాలోని ఆల్‌బెర్టాలో జరుగుతున్న జీ7 దేశాల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఏఐ ద్వారా రూపొందించే కంటెంట్‌కు తప్పనిసరిగా వాటర్‌మార్కింగ్ ఉండాలని లేదా అది ఏఐ సృష్టించినదనే స్పష్టమైన ప్రకటన ఉండాలని అభిప్రాయపడ్డారు. సమాజంపై ఏఐ చూపిస్తున్న ప్రభావం గురించి ప్రస్తావిస్తూ, ఈ సాంకేతికతకు సంబంధించిన సమస్యలను తగ్గించడానికి ప్రపంచవ్యాప్తంగా సమగ్రమైన పాలనా వ్యవస్థ అవసరమని ప్రధాని మోదీ సూచించారు. ప్రస్తుత యుగం ఏఐదే అయినప్పటికీ, సాంకేతికతతో కూడిన వ్యవస్థలను సురక్షితంగా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని ఆయన నొక్కిచెప్పారు. డీప్‌ఫేక్ కంటెంట్ వల్ల తలెత్తే ప్రమాదాలను తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రజలకు అందుబాటు ధరల్లో, నమ్మకమైన, స్థిరమైన సాంకేతిక వ్యవస్థలను అందించడమే భారత్ ప్రధాన లక్ష్యమని మోదీ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం ప్రజలకు ప్రయోజనం చేకూర్చినప్పుడే దానికి నిజమైన విలువ ఉంటుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ఈ విషయంలో ఏ దేశాన్ని కూడా వెనుకబడనివ్వకూడదని ఆయన అన్నారు. భారత్ తన సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రజాస్వామ్యబద్ధం చేసిందని, తద్వారా ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంతో పాటు, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ద్వారా సామాన్య ప్రజలను కూడా శక్తివంతం చేసిందని ఆయన వివరించారు. ఈ సందర్భంగా సమగ్రమైన, సామర్థ్యవంతమైన, బాధ్యతాయుతమైన ఏఐ వ్యవస్థ ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## వెనుకబడిన ప్రాంతాల్లో పరిశ్రమలు పెడితే అదనపు ప్రోత్సాహకాలు



అమరావతి, జూన్ 19: రాష్ట్రంలోని వెనుకబడిన ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టిన పరిశ్రమలు, ప్రాజెక్టులకు అదనపు ప్రోత్సాహకాలు ఇస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. పరిశ్రమలు ఏర్పాటు అయితే ఆయా ప్రాంతాలు కూడా అభివృద్ధి అవుతాయని.. స్థానికులకు ఉపాధి లభిస్తుందని తద్వారా అన్ని చోట్లకూ సంపద విస్తరిస్తుందని అన్నారు. సచివాలయంలో గురువారం సీఎం చంద్రబాబు అధ్యక్షతన 7వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మొత్తం 19 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 28,546 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ ఆమోదం తెలియజేసింది. ఈ పెట్టుబడుల ద్వారా 30,270 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నాయి. ఇప్పటి వరకూ జరిగిన 7 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ. 5,34,684 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించింది. తద్వారా 4.73,969 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.

**అన్నిప్రాంతాలు సమానాభివృద్ధి...** రాష్ట్రంలో ఏర్పాటయ్యే పారిశ్రామిక ప్రాజెక్టులో స్థానికులకే ఎక్కువ ఉద్యోగాలు దక్కాలని, అందుకు యువతకు అవసరమైన నైపుణ్యాభివృద్ధి కల్పన కూడా ప్రధాన అంశం కావాలని సీఎం స్పష్టం చేశారు. అన్ని ప్రాంతాల్లోనూ సమాన అభివృద్ధి జరగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడులు అన్ని ప్రాంతాల్లోనూ సమానంగా ఏర్పాటు అయ్యేలా ప్రణాళిక చేస్తున్నట్టు వెల్లడించారు. భూములు తీసుకున్న సంస్థలు నిర్దేశిత గడువులోగా యూనిట్లను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ విషయంలో ఆయా సంస్థల ప్రతినిధులతో చర్చించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని.. వీటిని వినియోగించుకుని ఒన్ ఫ్యామిలీ– ఒన్ ఎంటర్ ప్రెన్యూర్ కింద ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు అవకాశం కల్పించాలని సీఎం సూచించారు. మరోవైపు రాష్ట్రంలో ఏర్పాటు అయ్యే పరిశ్రమలు, ప్రాజెక్టులు, పెట్టుబడులు, కల్పించే ఉద్యోగాలకు సంబంధించిన వివరాలను ఆన్ లైన్ పోర్టల్ లో పొందుపర్చాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అలాగే క్లస్టర్ల వారీగానూ ఈ పరిశ్రమల మ్యాపింగ్ జరగాలని సీఎం సూచించారు.

**ఇక నుంచి ప్రతి నెలలో రెండు ఎస్ఐపీబీ సమావేశాలు...** పర్యాటకం, ఐటీ, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలు అభివృద్ధికి చోదకంగా మారాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఈ రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని వీటిని వినియోగించుకుని ఔత్సాహికులు పరిశ్రమలు ఏర్పాటు చేసేలా ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి సూచించారు. పోలవరం ప్రాజెక్టుతో పాటు పాపికొండలు వద్ద బోట్ టూరిజం లాంటి ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని అన్నారు. అలాగే విశాఖతో పాటు రాష్ట్రంలోని ఇతర తీరప్రాంతాల్లో లగ్జరీ బోట్, క్రూజ్ షిప్ లను ఆపరేట్ చేసేలా ఆయా సంస్థలతో చర్చించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో ఆతిథ్య రంగంలో ఒప్పందం చేసుకున్న వివిధ సంస్థలు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేలా చూడాలని సూచించారు. వివిధ పారిశ్రామిక ప్రాజెక్టుల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. ఇక నుంచి ప్రతి నెలలో రెండు ఎస్ఐపీబీ సమావేశాలు జరగాలని, ఏడాదికి కనీసం 25 సమావేశాలు జరిగేలా కార్యాచరణ ఉండాలని సీఎం సూచించారు.

**7వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదించిన పెట్టుబడుల వివరాలు..** రేమండ్ రూ. 1,201 కోట్లు, 6,571 మందికి ఉద్యోగాలు(వివిధ ప్రాంతాల్లో), జి.ఇన్ఫ్రా ప్రెసిజియన్స్ లిమిటెడ్ రూ. 1150 కోట్లు, 299 మంది ఉద్యోగాలు(అనంతపురం) సంగం డెయిరీ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 130 కోట్లు, 400 మంది ఉద్యోగ, ఉపాధి(తిరుపతి), కాగ్నిజెంట్ టెక్నాలజీ సొల్యూషన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ రూ. 1583 కోట్లు, 8000 ఉద్యోగాలు – 3 దశల్లో(విశాఖపట్నం), 3ఎఫ్ ఆయిల్ పామ్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 224 కోట్లు, 750 మందికి ఉద్యోగాలు (తూర్పు గోదావరి), ఏబీఐఎస్ ప్రొటీన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 350 కోట్లు, 790 మందికి ఉద్యోగాలు (చిత్తూరు), రిలయన్స్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ 1622 కోట్లు, 1200 మందికి ఉద్యోగాలు (ఓర్వకల్లు), మెల్గాన్ లైజర్స్ అండ్ ఎంటర్టైన్మెంట్ ఎల్ఎల్పీ రూ. 225 కోట్లు, 350 మందికి ఉద్యోగాలు (ఏలూరు), పావని హోటల్స్ లెమన్ ట్రీ ప్రీమియర్ రూ. 80 కోట్లు, 300 మందికి ఉద్యోగాలు ( తిరుపతి), గ్రీన్ పార్క్ హోటల్స్ అండ్ రిసార్ట్స్ లిమిటెడ్ రూ. 145 కోట్లు, 250 మందికి ఉద్యోగాలు (అమరావతి), బెర్రీ అల్లోస్ లిమిటెడ్ రూ. 573 కోట్లు, 320 మందికి ఉద్యోగాలు.(శ్రీ సత్యసాయి జిల్లా), చింతా గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ రూ. 2,323 కోట్లు, 540 మందికి ఉద్యోగాలు. (కడప), అదానీ రెన్యువబుల్ ఎనర్జీ ఫిఫ్టీ వన్ లిమిటెడ్ రూ. 8,010 కోట్లు, 3,500 మందికి ఉద్యోగాలు(కడప), చానల్ ప్లే రూ. 80 కోట్లు, 1100 మందికి ఉద్యోగాలు(కొప్పర్తి), అదానీ హైడ్రో ఎనర్జీ ఫోర్ లిమిటెడ్ అండ్ అదానీ హైడ్రో ఎనర్జీ వన్ లిమిటెడ్ రూ. 10,900 కోట్లు, 7,000 మందికి ఉద్యోగాలు.(రాష్ట్రంలోని వివిధ జిల్లాలు), బీపీసీఎల్ అండ్ కేఎస్ఎస్ఎల్, ఎల్టీ ఎలక్ట్రానిక్స్, కృష్ణపట్నం పవర్ కార్పొరేషన్‌లో అదనపు పెట్టుబడులు, మార్పులకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నాయి.

## ఫాస్టాగ్ వార్షిక పాస్.. ఇదో గేమ్ ఛేంజర్: పవన్ కల్యాణ్




అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : జాతీయ రహదారులపై ప్రయాణించే వారికి ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌ల వ్యవస్థపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం, భారత రహదారి మౌలిక సదుపాయాల ప్రస్థానంలో ఒక గేమ్ ఛేంజర్‌గా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ 'ఎక్స్ (ట్విట్టర్)' వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఫాస్టాగ్ వార్షిక పాస్‌లను ప్రవేశపెట్టాలన్న ప్రయాణికుల చిరకాల డిమాండ్‌కు ఈ నిర్ణయంతో సరైన పరిష్కారం లభించిందని పవన్ పేర్కొన్నారు. టోల్ చెల్లింపుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రయాణ ఖర్చులను గణనీయంగా తగ్గించడం ద్వారా ప్రైవేటు వాహన యజమానులకు ఈ కొత్త విధానం ఎంతో మేలు చేస్తుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. "రూ. 3000 వార్షిక పాస్‌తో వాహనదారులకు ఆర్థికంగా ఉపశమనం కలగడమే కాకుండా, దేశవ్యాప్తంగా సున్నితమైన, వేగవంతమైన, ఎలాంటి వివాదాలకు తావులేని విధంగా హైవే ప్రయాణం సాధ్యమవుతుంది" అని జనసేనాని పేర్కొన్నారు. ముఖ్యంగా టోల్ ప్లాజాల సమీపంలో నివసిస్తూ, తరచూ ప్రయాణించే వారికి ఈ విధానం వల్ల సమయంతో పాటు ఆర్థిక భారం కూడా తగ్గుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి ప్రజాపాలన పట్ల ఉన్న నిబద్ధతకు నితిన్ గడ్కరీ తీసుకున్న ఈ నిర్ణయం ఒక నిదర్శనమని పవన్ కొనియాడారు. కాగా, ఫాస్టాగ్ ఆధారిత వార్షిక పాస్‌లను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తీసుకురానున్నట్లు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తాజాగా ప్రకటించిన సంగతి తెలిసిందే. రూ. 3000 చెల్లించి ఈ పాస్‌ను పొందవచ్చని ఆయన 'ఎక్స్ (ట్విట్టర్)' లో వెల్లడించారు. గడ్కరీ చేసిన ఈ పోస్టును రీట్వీట్ చేస్తూ పవన్ కల్యాణ్ పైవిధంగా స్పందించారు. అయితే, ప్రస్తుతం కార్లు, జీపులు, వ్యాన్‌ల వంటి వాణిజ్యేతర వాహనాలకు వర్తించేలా కేంద్రం ప్రకటించిన ఈ పాస్‌కు సంబంధించిన పూర్తిస్థాయి మార్గదర్శకాలు, వర్తించే నిబంధనలు ఇంకా వెలువడాల్సి ఉంది.

## భారత్-పాక్ మధ్య నేను కుదిర్చినట్టుగా ఇజ్రాయెల్-ఇరాన్ కూడా ఒక ఒప్పందం కుదుర్చుకోవాలి: ట్రంప్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రస్తుతం ఉద్రిక్తంగా మారిన ఇజ్రాయెల్–ఇరాన్ వివాదంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరు దేశాలు చర్చల ద్వారా ఓ ఒప్పందానికి రావాలని, ఇటీవల తాను భారత్–పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చిన తరహాలోనే ఇజ్రాయెల్–ఇరాన్ కూడా ఓ ఒప్పందం కుదుర్చుకోవాలని సూచించారు. ఇది కూడా సాధ్యమవుతుందని భావిస్తున్నానని ఆయన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ట్రూత్ సోషల్'లో పేర్కొన్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న ఇజ్రాయెల్–ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో డొనాల్డ్ ట్రంప్ తనదైన శైలిలో స్పందించారు. "ఇరాన్, ఇజ్రాయెల్ ఓ ఒప్పందం చేసుకోవాలి, కచ్చితంగా చేసుకుంటాయి. గతంలో నేను భారత్, పాకిస్తాన్‌ల మధ్య ఒప్పందం కుదిర్చినట్లే ఇది కూడా జరుగుతుంది. అమెరికాతో వాణిజ్యాన్ని (ట్రేడ్) ఉపయోగించి ఇరు దేశాల అద్భుతమైన నేతలతో చర్చలు జరిపి, సహేతుకత, సమన్వయం, వివేకాన్ని తీసుకువచ్చి, వారిని త్వరితగతిన ఓ నిర్ణయానికి వచ్చేలా చేసి, వివాదాన్ని ఆపగలిగాను!" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు. కేవలం భారత్–పాకిస్తాన్ వివాదమే కాకుండా, తాను మరికొన్ని అంతర్జాతీయ సమస్యలను కూడా పరిష్కరించానని ట్రంప్ చెప్పుకొచ్చారు. "నా మొదటి విడత అధ్యక్ష పదవీకాలంలో, సెర్బియా, కొసావోలు దశాబ్దాలుగా తీవ్రంగా ఘర్షణ పడుతుండేవి. ఆ చిరకాల వివాదం యుద్ధంగా మారేందుకు సిద్ధంగా ఉండేది. నేను దాన్ని ఆపాను. గత అధ్యక్షుడు బైడెన్ కొన్ని తెలివితక్కువ నిర్ణయాలతో దీర్ఘకాలిక అవకాశాలను దెబ్బతీశారు, కానీ నేను దాన్ని మళ్ళీ సరిచేస్తాను!" అని ట్రంప్ పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈజిప్ట్, ఇథియోపియాల మధ్య నైలు నదిపై నిర్మిస్తున్న భారీ డ్యామ్ విషయంలో తలెత్తిన వివాదాన్ని కూడా తానే పరిష్కరించానని ఆయన తెలిపారు. "నా జోక్యం వల్లే, కనీసం ఇప్పటికైనా అక్కడ శాంతి నెలకొంది, అది అలాగే ఉంటుంది! అదేవిధంగా, ఇజ్రాయెల్, ఇరాన్‌ల మధ్య కూడా త్వరలోనే శాంతి నెలకొంటుంది! ప్రస్తుతం అనేక ఫోన్ కాల్స్, సమావేశాలు జరుగుతున్నాయి. నేను చాలా చేస్తాను, కానీ దేనికీ నాకు గుర్తింపు రాదు, అయినా ఫర్వాలేదు, ప్రజలకు అర్థమవుతుంది" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. చివరగా, "మధ్యప్రాచ్యాన్ని మళ్లీ గొప్పగా చేద్దాం!" అంటూ తన పోస్ట్‌ను ముగించారు. ట్రంప్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం అంతర్జాతీయంగా చర్చనీయాంశంగా మారాయి.

## అమిత్ షాతో మంత్రి నారా లోకేశ్ భేటీ



ఢిల్లీ, నేటి పత్రిక ప్రజావార్త : ఏపీ మంత్రి నారా లోకేశ్ బుధవారం ఢిల్లీలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాతో సమావేశమయ్యారు. ఈ భేటీ దాదాపు 25 నిమిషాల పాటు సాగింది. రాష్ట్రానికి సంబంధించిన అనేక కీలకమైన అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలు, కేంద్ర సహకారంతో అమలుచేస్తున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతి, రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను లోకేశ్ వివరించారు. ఈనెల 21న విశాఖలో ప్రధాని మోదీ హాజరయ్యే యోగాంధ్ర కార్యక్రమానికి విస్తృతమైన ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రాజెక్టుల పురోగతిని వివరిస్తూ కొత్తప్రాజెక్టులకు కేంద్రం సహకారం అందించాలని కోరారు. యువగళం పాదయాత్ర అనుభవాలతో రూపొందించిన యువగళం పుస్తకాన్ని అమిత్ షాకు అందజేశారు. సుదీర్ఘ పాదయాత్రతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన లోకేశ్‌ను అమిత్ షా ప్రత్యేకంగా అభినందించారు. చంద్రబాబు సుదీర్ఘ పాలన అనుభవం ఏపీని అభివృద్ధి బాటలో నడిపిస్తుంది, ఏపీలో డబుల్ ఇంజన్ సర్కారుకు కేంద్ర సహకారం కొనసాగుతుందని అమిత్ షా భరోసా ఇచ్చారు. ఈ సమావేశం అనంతరం లోకేశ్ మరికొందరు కేంద్ర మంత్రులను కూడా కలవనున్నట్లు సమాచారం. కేంద్ర మంత్రులు చిరాగ్ పాశ్వాన్, అర్జున్‌రామ్ మేఘ్వాల్‌ను ఆయన కలవనున్నారు. ఢిల్లీ పర్యటనలో భాగంగా లోకేశ్ ఈరోజు ఉదయం భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్‌తో కూడా మర్యాదపూర్వకంగా భేటీ అయిన విషయం తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై కేంద్ర ప్రభుత్వ పెద్దలతో వరుస భేటీలు నిర్వహిస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది.

## జగన్ ర్యాలీలోని కారు ఢీ కొని వృద్ధుడు మృతి



గుంటూరు, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గుంటూరు పర్యటనలో విషాదం చోటుచేసుకుంది. ఆయన ర్యాలీలోని వాహనం ఢీ కొట్టడంతో ఓ వృద్ధుడు మరణించాడు. గుంటూరు జిల్లా ఏటుకూరు సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. సత్తెనపల్లి మండలం రెంటపాళ్లలో పర్యటించేందుకు వైఎస్ జగన్ ఈ రోజు ఉదయం భారీ కాన్వాయ్ తో తాడేపల్లి నుంచి బయలుదేరారు. జగన్ పర్యటన నేపథ్యంలో వైసీపీ కార్యకర్తలు వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఈ క్రమంలో ఏటుకూరు బైపాస్ వద్ద నడుచుకుంటూ వెళుతున్న ఓ వృద్ధుడిని జగన్ ర్యాలీలోని ఓ వాహనం ఢీ కొట్టింది. దీంతో వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే 108 కు సమాచారం అందించారు. అంబులెన్స్ సిబ్బంది వెంటనే అక్కడికి చేరుకుని వృద్ధుడిని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ వృద్ధుడు మరణించాడని వైద్యులు తెలిపారు. కాగా, వృద్ధుడిని ఢీ కొట్టినా ర్యాలీ ఆపకుండా వెళ్లిపోవడంతో వైసీపీ నేతలపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## ఘనంగా అంతర్జాతీయ యోగా డే

*రెండు గిన్నీస్ బుక్ రికార్డులు , మొత్తం 22 ప్రపంచ రికార్డుల సాధన లక్ష్యంగా యోగాంధ్ర*

*22,122 మంది గిరిజన విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేపట్టి గిన్నిస్ రికార్డు సృష్టించారు*



విశాఖపట్నం, నేటి పత్రిక ప్రజావార్త : యోగా సాధన మానసిక, శారీరక ఆరోగ్యానికి మార్గం చూపుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖ ఆర్కే బీచ్ లో జరిగిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అంతకుముందు ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీకి చంద్రబాబు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ""దేశం, ప్రాంతం, మతం, భాషతో సంబంధం లేకుండా యోగాకు ఆమోదం లభించింది. శరీరం, మనస్సు, ఆత్మలను కలిపేందుకు యోగానే మార్గం. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తుంది. ఒత్తిడిని అధిగమించవచ్చు, రోగనిరోధక శక్తిని పెంపొందించుకోవచ్చు. అలాగే ఆత్మవిశ్వాసం పెంచుకోవడం.. మానసిక ప్రశాంతతకు యోగా ఉపకరిస్తుంది. యోగా హింసను తగ్గిస్తుంది. శాంతిని ప్రోత్సహిస్తుంది. ఏఐతో సహా టెక్నాలజీ అందుబాటులోకి రావడంతో యోగా మరింత విస్తృతమైంది." అని అన్నారు.

**ప్రధాని మోదీతోనే యోగాకు గుర్తింపు..** యోగా అంతర్జాతీయ స్థాయికి చేరడానికి ప్రధాని నరేంద్ర మోదీ కారణమని చంద్రబాబు గుర్తు చేశారు. "యోగాకు ప్రపంచవ్యాప్త ప్రాచుర్యం కల్పించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి ధన్యవాదాలు. ఐక్యరాజ్యసమితి ద్వారా ప్రధాని మోదీ యోగాను ప్రపంచ ఆరోగ్య ఉద్యమంగా మార్చారు. మోదీ చొరవతో మన భారతదేశ సంస్కృతి అయిన యోగాను 175కు పైగా దేశాలలో, 12 లక్షల ప్రదేశాలలో, 10 కోట్ల మందికి పైగా ప్రజలు అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొంటున్నారు." అని చంద్రబాబు అన్నారు.

**యోగాంధ్ర - ఒక చారిత్రక విజయం...** ఈ కార్యక్రమానికి ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని కల్పించి, విశాఖకు వచ్చి యోగా డేలో పాల్గొన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి కృతజ్ఞతలు తెలిపారు. "ప్రధాని మోదీ విజన్‌తో స్ఫూర్తి పొంది, ఏపీలో ఒక నెల రోజుల పాటు యోగాంధ్ర ప్రచారాన్ని నిర్వహించాం. దీంట్లో భాగంగా 1.44 లక్షల మంది యోగా శిక్షకులకు శిక్షణ ఇచ్చి, 1.40 లక్షలకు పైగా ప్రాంతాల్లో 2.17 కోట్ల మందికి పైగా యోగాలో పాల్గొన్నారు. ఈ మేరకు రిజిస్ట్రేషన్లు చేపట్టాం. విశాఖపట్నంలో ఒకే ప్రదేశంలో 3 లక్షల మందికి పైగా పాల్గొన్నారు. 1.70 కోట్ల మందికి ధృవపత్రాలు జారీ చేశాం. శుక్రవారం 22,122 మంది గిరిజన విద్యార్థులు ఒకేసారి సూర్య నమస్కారాలు చేసి గిన్నిస్ రికార్డు సాధించడం మనకు గర్వకారణం." అని చంద్రబాబు పేర్కొన్నారు.

**విజన్ స్వర్ణ ఆంధ్ర ఏ 2047 & వన్ ఎర్త్ - వన్ హెల్త్...** యోగా వల్ల సంతోషకరమైన సమాజం ఏర్పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. వికసిత్ భారత్ లో భాగంగా "విజన్ స్వర్ణ ఆంధ్ర ఏ 2047 ప్రణాళికను అనుసరించి అభివృద్ధి, సంక్షేమాలను సాధించడంతో పాటు హెల్తీ వెల్తీ, హ్యాపీ ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దడమే లక్ష్యం. ప్రధాని నరేంద్ర మోదీ ప్రోత్సాహం వల్లే యోగా, ప్రకృతి చికిత్స, ఆయుర్వేదం, గ్రీన్ ఎనర్జీ, స్వచ్ఛ భారత్, ప్రకృతి వ్యవసాయం వంటి వాటి పునరుద్ధరణ సాధ్యమైంది. మోదీ విజన్ వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడడానికి మార్గం సుగమమైంది. వన్ ఎర్త్ – వన్ హెల్త్ స్ఫూర్తిని బలోపేతం చేయడానికి కలిసి పనిచేయాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారు.

ఏపీలో నెల రోజుల పాటు నిర్వహించిన కార్యక్రమాల గురించి సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా ప్రస్తావించారు. "ఇక్కడికి వచ్చిన వారితో పాటు.. యోగాడేలో పాల్గొన్న వారంతా చారిత్రాత్మకమైన కార్యక్రమంలో పాల్గొన్నట్టే. తెలుగు ప్రజలు 30 రోజుల పాటు ఒక దీక్షలా, ఒక ఉద్యమంలా యోగా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. సత్తా చాటారు. యోగాంధ్ర కార్యక్రమం ట్రెండ్ సెట్టర్‌గా నిలిచింది. నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ ఉద్యమాన్ని ఆచరించి, జీవన విధానంగా మార్చుకుని అందర్లో చైతన్యం తీసుకువస్తూ...తెలుగు జాతి ప్రపంచానికి ఆదర్శంగా నిలవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను." అని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ప్రధాని నరేంద్ర మోదీని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కలంకారీ శాలువాతో సన్మానించి.. లక్ష్మీ నరసింహస్వామి జ్ఞాపికను అందచేశారు.

## ఇజ్రాయెల్ ఆర్థిక వ్యవస్థపై ఇరాన్ దాడుల దెబ్బ: ఒక్క రాత్రి ఖర్చు రూ.2400 కోట్లు!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఇరాన్‌తో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఇజ్రాయెల్ ఆర్థికంగా తీవ్ర భారం మోయాల్సి వస్తోంది. ఇరాన్ ప్రయోగిస్తున్న క్షిపణుల నుంచి తమ భూభాగాన్ని కాపాడుకునేందుకు ఇజ్రాయెల్ రాత్రికి రాత్రే భారీగా నిధులు వెచ్చిస్తోంది. ఈ గగనతల రక్షణ వ్యవస్థ నిర్వహణకే ప్రతి రాత్రి సుమారు 285 మిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ. 2,400 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇజ్రాయెల్ నిఘా వర్గాల అంచనాలను ఉటంకిస్తూ అమెరికా అధికారులు ఈ వివరాలను వెల్లడించినట్లు 'వాల్‌స్ట్రీట్ జర్నల్' తెలిపింది. గతవారం ఇరాన్ అణుకేంద్రాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ 'ఆపరేషన్ రైజింగ్ లయన్' చేపట్టినప్పటి నుంచి ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఇరాన్ కూడా ఇజ్రాయెల్‌పై ప్రతీకార దాడులకు దిగింది. ఇప్పటివరకు సుమారు 400 బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించినట్లు టెహ్రాన్ ప్రకటించింది. ఈ క్షిపణులను ఎదుర్కోవడానికి ఇజ్రాయెల్ తన 'యారో సిస్టమ్', 'డేవిడ్స్ స్లింగ్' వంటి అత్యాధునిక రక్షణ వ్యవస్థలతో పాటు అమెరికా సరఫరా చేసిన 'పేట్రియాట్స్', 'థాడ్' బ్యాటరీలను కూడా మోహరించింది. అయినప్పటికీ, ఇరాన్ క్షిపణులు కొన్ని కీలక ప్రాంతాలపై పడుతుండటంతో ఇజ్రాయెల్ తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ రక్షణ వ్యవస్థల నిర్వహణ ఖర్చు ఇప్పుడు ఇజ్రాయెల్‌కు పెను భారంగా మారింది. ఒక్కో 'యారో సిస్టమ్' ఇంటర్‌సెప్టర్ విలువ సుమారు 3 మిలియన్ డాలర్లు ఉంటుందని, వీటిని ప్రయోగించి క్షిపణులను అడ్డుకుంటున్నారని 'ది మార్కర్' అనే ఇజ్రాయెల్ ఆర్థిక దినపత్రిక అంచనా వేసింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఇరాన్ దాదాపు ప్రతిరోజూ క్షిపణులను ప్రయోగిస్తూనే ఉంది. ఈ దాడులు ఇలాగే కొనసాగితే ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థ నిల్వలు ప్రమాదకరస్థాయికి పడిపోయే అవకాశం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా నుంచి సకాలంలో ఆయుధ సరఫరా లేదా ఆర్థిక సాయం అందకపోతే, ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థ 10 నుంచి 12 రోజుల్లోనే బలహీనపడవచ్చని సమాచారం. ఇరాన్ దాడుల వల్ల టెల్ అవీవ్‌లోని ఇజ్రాయెల్ సైనిక దళాల (ఐడీఎఫ్) ప్రధాన కార్యాలయం, హైఫా సమీపంలోని కీలక చమురు శుద్ధి కర్మాగారం, ఇజ్రాయెల్ నిఘా విభాగానికి సమీపంలోని ప్రాంతాలు దెబ్బతిన్నాయని తెలుస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటివరకు 24 మంది మరణించారని, మరో 600 మంది గాయపడ్డారని నెతన్యాహు ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఇరాన్ సైనిక మౌలిక వసతులను దెబ్బతీసి విజయం సాధించామని ఇజ్రాయెల్ చెబుతున్నప్పటికీ, ఈ ప్రతిదాడులను అడ్డుకోవడానికి మాత్రం ఆ దేశం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

## చంద్రబాబుగారూ... ఇది మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే: జగన్



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ముఖ్యమంత్రి చంద్రబాబు నియోజకవర్గం కుప్పంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసించిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కలకలం రేపింది. ఈ ఘటనపై వైసీపీ అధినేత జగన్ ఎక్స్ వేదికగా తీవ్ర స్థాయిలో స్పందించారు. "చంద్రబాబు గారూ... రాష్ట్రంలో మహిళలకు మీరు కల్పిస్తున్న రక్షణ ఇదేనా? మీ పాలనలో మహిళలకు లభిస్తున్న ఆత్మగౌరవం ఇదేనా? సాక్షాత్తూ మీరు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గం నారాయణపురం గ్రామంలో ఒక మహిళను చెట్టుకు కట్టేసి, హింసిస్తున్న ఘటన, మీ దుర్మార్గపు పరిపాలన ఫలితమే. తిమ్మరాయప్ప అనే కూలీ అప్పు చెల్లించలేదనే కారణంతో అతని భార్య శిరీషను మీ పార్టీ కార్యకర్త చెట్టుకు కట్టేసి, హింసించాడు. ఆమె బిడ్డలు రోదిస్తున్నా సరే కనికరం చూపలేదు, విడిచిపెట్టలేదు. చంద్రబాబుగారూ.. మీ హయాంలో జరిగిన అనేక క్రూరమైన ఘటనల్లో ఇదొకటి" అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పొలిటికల్ గవర్నెన్స్, రెడ్‌బుక్ పేరిట మీరు నెలకొల్పిన దుష్ట సంప్రదాయంలో భాగంగా మీరు, మీ పార్టీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా చెలరేగిపోయి చేస్తున్న దుర్మార్గాలకు మహిళలు, యువతులు, బాలికలు ఇలా ఎందరో బలైపోతున్నారని జగన్ మండిపడ్డారు. ఈ ఘటనతోపాటు, ఏడాదికాలంలో రాష్ట్రవ్యాప్తంగా మహిళలపై జరిగిన అన్యాయాలు, అఘాయిత్యాలను సీరియస్‌గా తీసుకోవాలని, చట్టప్రకారం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం విజయవంతం

*గ్రీన్ యోగా నేపథ్యంగా స్వచ్ ఆరోగ్యం, స్వచ్ ఆలోచనలు - కలెక్టర్ లక్ష్మీష*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఎంజీ రోడ్ వద్దగల ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీష, జాయింట్ కలెక్టర్ కె. ఇలేకియా మరియు విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం శనివారం ఉదయం ఘనంగా నిర్వహించబడింది. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీష మాట్లాడుతూ, ఈ నెల "గ్రీన్ యోగా" అంశంతో జరిపిన ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై మరియు శుభ్రతపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఉందన్నారు. యోగా, స్వచ్ఛత, ప్రకృతి, ప్రేమ అనే మూడు అంశాలను సమన్వయంతో కలిపిన ఈ ప్రత్యేక కార్యక్రమం విశేష స్పందన పొందిందని, ప్రజల జీవనశైలిలో శుభ్రత అనేది భాగం కావాలని, యోగా వంటి ఆరోగ్యకరమైన అలవాట్లతో కలిపి తీసుకువచ్చే స్వచ్ఛ కార్యక్రమాలు సమాజాన్ని మంచి మార్గంలో నడిపిస్తాయి అని అన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ కె. ఇలేకీయ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ నివాస ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే అలవాటు పెంచుకోవాలని, యోగా ద్వారా వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుతూ, సామూహికంగా శుభ్రతపై శ్రద్ధ తీసుకోవడం అవసరం అని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రతినెలా ఓ కొత్త అంశంతో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించటం ఆనందకరం. ఈనెల 'స్వచ్ ఆరోగ్యం – స్వచ్ ఆలోచన'లతో నిర్వహించిన గ్రీన్ యోగా కార్యక్రమం ప్రజల్లో చైతన్యం కలిగించింది. ఇదే తరహాలో ప్రతి సచివాలయ పరిధిలో కూడా స్వర్ణాంధ్ర– స్వచ్ఛంధ్ర కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్నాం అని తెలిపారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రజల్లో యోగా, స్వచ్ఛత గురించి అవగాహన కల్పించేందుకు ఇంద్రగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద యోగ చేయండి ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే నినాదంతో భారీ ర్యాలీ నిర్వహించారు, గ్రీన్ యోగాలో భాగంగా పర్యావరణాన్ని పర్యవేక్షించేందుకు ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియం ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఆర్ డి ఓ కె. చైతన్య, డిస్టిక్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుహాసిని, జోనల్ కమిషనర్ కె. ప్రభుదాస్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబుశ్రీనివాస్, విద్యార్థులు, యోగా అభ్యాసకులు, పాల్గొన్నారు.

## చంద్రబాబుతో సమావేశం గొప్పగా సాగింది: కేంద్రమంత్రి పియూష్ గోయల్



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశంపై కేంద్రమంత్రి పియూష్ గోయల్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సీఎం చంద్రబాబుతో గుంటూరులో తాను సమావేశమైనట్టు తెలిపారు. ఈ భేటీ అత్యంత ఫలవంతంగా జరిగిందని, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తాము చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రి చంద్రబాబుతో తాను లోతైన చర్చలు జరిపినట్లు కేంద్రమంత్రి పియూష్ గోయల్ వివరించారు. ప్రత్యేకించి, ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక ప్రగతిని పరుగులు పెట్టించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా దృష్టి సారించినట్లు ఆయన వెల్లడించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, పారిశ్రామిక రంగంలో నూతన అవకాశాల కల్పన వంటి అంశాలు తమ సంభాషణలో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు, వారి జీవితాల్లో సానుకూల పరివర్తన తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి కేంద్ర ప్రభుత్వం తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని పియూష్ గోయల్ హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలు కేంద్రం అందిస్తుందని ఆయన స్పష్టం చేశారు. ఈ దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్రం అండగా నిలుస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ మేరకు చంద్రబాబుతో భేటీ వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు.

## కేసీఆర్, జగన్ నా ఫోన్ ట్యాప్ చేయించారు... రేవంత్, చంద్రబాబు విచారణను వేగవంతం చేయాలి: షర్మిల



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్, ఏపీ మాజీ ముఖ్యమంత్రి జగన్ లపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన ఫోన్‌ను ట్యాప్ చేశారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆమె మండిపడ్డారు. ఈ వ్యవహారంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో వైఎస్ షర్మిల మాట్లాడుతూ, "ఇంత దుర్మార్గంగా వ్యవహరిస్తారా?" అంటూ వైఎస్ జగన్‌ను ఉద్దేశించి తీవ్ర స్వరంతో ప్రశ్నించారు. గత ప్రభుత్వాల హయాంలో తన ఫోన్‌ను నిరంతరం ట్యాప్ చేశారని ఆమె ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రత్యర్థి అయినందుకే తన వ్యక్తిగత సంభాషణలను కూడా దొంగచాటుగా విన్నారని, ఇది వ్యక్తిగత గోప్యతకు తీవ్ర భంగం కలిగించడమే కాకుండా, ప్రజాస్వామ్య విలువలకు కూడా విఘాతమని ఆమె పేర్కొన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు ఈ ఫోన్ ట్యాపింగ్ తతంగం నడిచిందని షర్మిల ఆరోపించారు. "ఒక మహిళ అని కూడా చూడకుండా, ఒక రాజకీయ నాయకురాలిగా నా కార్యకలాపాలను అడ్డుకోవడానికి, నా వ్యూహాలను తెలుసుకోవడానికి ఇంత నీచమైన చర్యలకు పాల్పడ్డారు" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా సేకరించిన సమాచారాన్ని తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకున్నారని ఆమె దుయ్యబట్టారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ, ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్యంలో ఎంతమాత్రం ఆమోదయోగ్యం కావని అన్నారు. అధికారంలో ఉన్నవారు తమ అధికారాన్ని దుర్వినియోగం చేస్తూ, ప్రత్యర్థులపై నిఘా పెట్టడం, వారి సంభాషణలను రహస్యంగా వినడం వంటివి చట్టవ్యతిరేకమని, నైతికంగా కూడా తప్పని ఆమె స్పష్టం చేశారు. ఈ ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై సమగ్రమైన విచారణ జరిపించాలని, ఇందులో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరినీ చట్టం ముందు నిలబెట్టి కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆమె హితవు పలికారు. ప్రజల వ్యక్తిగత స్వేచ్ఛను, గోప్యతను కాపాడటంలో ప్రభుత్వాలు విఫలమైతే ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందని ఆమె హెచ్చరించారు. గతంలో వైవీ సుబ్బారెడ్డి సైతం ట్యాపింగ్ విషయాన్ని ధ్రువీకరించి, ఓ ఆడియోను తనకు వినిపించారని షర్మిల వెల్లడించారు. తెలంగాణలో తనను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కేందుకే కేసీఆర్, జగన్ కలిసి ఈ కుట్ర పన్నారని ఆమె తీవ్రంగా ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్ ఘటనపై తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు నాయుడు తక్షణం విచారణను వేగవంతం చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేసీఆర్ కోసం జగన్ తనను రాజకీయంగా అణచివేయాలని చూశారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. విచారణకు ఎప్పుడు పిలిచినా తాను హాజరవుతానని స్పష్టం చేశారు.

## కమిషనర్‌గా అదనపు బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ పి.ప్రశాంతి



రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త : రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ గా జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అదనపు బాధ్యతలను స్వీకరించారు. ఈ మేరకు స్థానిక కలెక్టరేట్ లో శనివారం చార్జ్ తీసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఎంసి అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ పాల్గొన్నారు.

## డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మహిళలకు ఆటల పోటీలు



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : సెంట్రల్ నియోజకవర్గంలో 58వ డివిజన్లో ఈరోజు సెంట్రల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బోండా ఉమ ఆదేశానుసారం మహిళా గృహిణిలకు మ్యూజికల్ చైర్, కబడ్డీ మొదలైన ఆటల పోటీలు నిర్వహించటం జరిగింది. భార్యగా, తల్లిగా ఇంటిని దిద్దే ఇల్లాలిగా ఎన్నో బాధ్యతలు తీసుకుంటున్న మహిళలకు మైండ్ రిలీఫ్ కోసం డొక్కా సీతమ్మ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు అవుటపల్లి విజయ కుమారి ఆధ్వర్యంలో ఈ ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ట్రస్ట్ కమిటీ సంసాని విజయలక్ష్మి, గుబ్బల జ్యోతి, అవుటుపల్లి ఉమామహేశ్వరి ఇతర సభ్యులతో పాటు 59వ డివిజన్ పర్వీన్, పెద్ద గౌస్య తదితరులుహాపాల్గొన్నారు.

## ప్రపంచవ్యాప్తంగా 27 కోట్ల మంది చిన్నారులు బడికి దూరం!



డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచవ్యాప్తంగా పాఠశాల విద్యకు దూరంగా ఉంటున్న పిల్లల సంఖ్య ఆందోళనకర స్థాయిలో 27.2 కోట్లకు చేరిందని ఐక్యరాజ్యసమితి విద్యా, వైజ్ఞానిక, సాంస్కృతిక సంస్థ (యునెస్కో)కు చెందిన గ్లోబల్ ఎడ్యుకేషన్ మానిటరింగ్ (జీఈఎం) బృందం తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది గత అంచనా కంటే 21 మిలియన్లు ఎక్కువ కావడం గమనార్హం. ప్రస్తుత అంచనాల ప్రకారం 2025 నాటికి వివిధ దేశాలు నిర్దేశించుకున్న జాతీయ విద్యా లక్ష్యాలకు దాదాపు 75 మిలియన్ల మేర వెనుకబడి ఉంటాయని జీఈఎం బృందం హెచ్చరించింది. ఈ గణాంకాలు ప్రపంచ విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సవాళ్లను స్పష్టం చేస్తున్నాయి. బడి బయట పిల్లల సంఖ్య ఊహించిన దానికంటే ఎక్కువగా నమోదు కావడానికి గల కారణాలను కూడా నివేదిక విశ్లేషించింది. ఈ పెరుగుదలకు ప్రధానంగా రెండు కారణాలున్నాయని తెలిపింది. మొదటిది, కొత్తగా సేకరించిన విద్యార్థుల నమోదు, హాజరుకు సంబంధించిన గణాంకాల వల్ల సుమారు 8 మిలియన్ల (38 శాతం) పెరుగుదల నమోదైందని పేర్కొంది. రెండోది, 2021లో ఆఫ్ఘనిస్థాన్‌లో సెకండరీ పాఠశాల వయసు బాలికల విద్యపై విధించిన నిషేధం కూడా ఈ పెరుగుదలకు గణనీయంగా దోహదపడిందని నిన్న విడుదలైన ఈ నివేదిక వివరించింది. ఈ గణాంకాలు ప్రపంచ దేశాలు తమ విద్యా విధానాలను సమీక్షించుకుని, సార్వత్రిక విద్య లక్ష్యాలను చేరుకోవడానికి మరింత పటిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతను నొక్కి చెబుతున్నాయి. ముఖ్యంగా, సంఘర్షణ ప్రభావిత ప్రాంతాలు, బాలికల విద్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రి నారా లోకేశ్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : కార్యకర్తే అధినేత అనే మాటను శిరసావహిస్తూ ఆపదవేళ వారికి అన్ని విధాల అండగా నిలుస్తున్నారు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్. గత ప్రభుత్వ పాలనలో రౌడీ మూకల దాడిలో దారుణహత్యకు గురైన పల్నాడు జిల్లా రొంపిచర్ల మండల టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబానికి పెద్దకొడుకులా జీవితాంతం అండగా ఉంటాననే హామీని మంత్రి నిలబెట్టుకున్నారు. దివంగత వెన్నా బాలకోటిరెడ్డి ఇంటిపై తీసుకున్న రుణాన్ని మంత్రి లోకేశ్ తీర్చారు. ఆయన సతీమణి వెన్నా నాగేంద్రమ్మకు నెలనెలా ఆర్థికసాయం అందజేస్తూ ఇంటికి పెద్దకొడుకులా అండగా నిలిచారు.



**పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల బాధ్యత తీసుకున్న మంత్రి లోకేశ్..**

అలవాల గ్రామానికి చెందిన వెన్నా బాలకోటిరెడ్డి నాలుగు దశాబ్దాల పాటు పార్టీ కోసం కష్టపడి పనిచేశారు. ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. దీనిని ఓర్చుకోలేని గూండాలు అప్పటి వైసీపీ ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అండతో ఇంట్లో నిద్రిస్తున్న బలాకోటిరెడ్డిని తుపాకీతో కాల్చిచంపారు. హత్యకు ఆరు నెలల ముందు కూడా కత్తులతో దాడికి తెగబడ్డారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత గత నెల 21న బాలకోటిరెడ్డి కుటుంబ సభ్యులను ఉండవల్లి నివాసానికి పిలుపించుకున్న మంత్రి లోకేశ్.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆర్థికంగా చాలా నష్టపోయామని, తాము నివసిస్తున్న ఇల్లు తాకట్టులో ఉందని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పార్టీ కోసం జీవితాంతం కష్టపడిన వెన్నా బాలకోటిరెడ్డి కుటుంబానికి పెద్దకొడుకులా జీవితాంతం అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల బాధ్యత తీసుకున్న మంత్రి లోకేశ్ నియోజకవర్గ పర్యటనల్లో ముందుగా కార్యకర్తలతో సమావేశమవుతున్నారు. ఉండవల్లి నివాసంలోనూ కార్యకర్తలను నేరుగా కలుసుకుని వారికి అండగా నిలుస్తున్నారు.

## ఉపరాష్ట్రపతితో నారా లోకేశ్ భేటీ

భారత ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్ తో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సాధించిన విజయాలు, అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మరింత వేగవంతమైన అభివృద్ధికి మీ వంతు సహాయ, సహకారాలను అందించాలని కోరారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో క్వాంటమ్‌వ్యాలీని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దీనికి ఉపరాష్ట్రపతి ధన్కర్ స్పందిస్తూ అధునాతన టెక్నాలజీని అంది పుచ్చుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై ధన్కర్ వాకబు చేయగా, రూ. 64 వేల కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించామని, పనులు వేగంగా పూర్తిచేస్తామని లోకేశ్ చెప్పారు. ప్రత్యక్ష రాజకీయాల్లో ప్రవేశానికి గత 40 ఏళ్లలో ఎప్పుడూ గెలవని మంగళగిరిని తాను ఎంచుకున్నానని లోకేశ్ చెప్పగా, తాను కూడా తొలిసారి పరిచయం లేని నియోజకవర్గాన్నే ఎంచుకొని పోరాడానని ధన్కర్ అన్నారు.

## యోగాలో ఆక్యుప్రెజర్ అక్యూపంక్చర్ ను కలపాలి

*-యోగ శక్తి సాధనా సమితి*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవంలో భాగంగా జూన్ 21వ తేదీన గుంటూరు జిల్లా లోని నల్లపాడు ఎంబిటిఎస్ గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజీ లో జరిగిన ఉత్సవాలను కాలేజీ ప్రిన్సిపాల్ తాళ్లూరి శేఖర్ ప్రారంభించి యోగాంధ్రా తో ఆరోగ్యాంధ్ర ఏర్పడిందని, ఇలాంటి బృహత్తర కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. యోగ ఉత్సవాలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ విద్యార్థులకు ఉద్యోగులకు యోగ మరియు ఆక్యుప్రెషర్ సమ్మేళిత మైన మోడీ ఫిట్నెస్ మంత్ర పై అవగాహన కలిగించారు. ఎవరైతే నిరంతర సాధన చేస్తారు వారు ఎలాంటి అనారోగ్యం లేకుండా పరిపూర్ణ జీవితం గడప కలుగుతారని తెలిపారు. అంతర్జాతీయంగా ఆక్యు ప్రెషర్ ఆక్యుపంక్చర్ మరియు అనేక ఇతర పేర్ల మీద వాడబడుతున్న యోగ ప్రాణమయ కోశా విధానాలను యోగాకు చేర్చి యోగాకు పూర్వ దశ వచ్చేలాగా చేయవలసిందిగా రాష్ట్ర,కేంద్ర ప్రభుత్వాలను యోగ శక్తి సాధనా సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ కోరారు. ఈ యోగ ప్రాణమయ కోశ పెంచటానికి నూతన కాలేజీలు, పరిశోధనా కేంద్రాలు వాటికి కావలసిన అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేసి, ప్రభుత్వ అన్ని హాస్పిటల్స్ లో వీటి సౌకర్యం పెంచి యోగ ఆరోగ్యం ప్రజలకు మరింత చేరువు చేయవలసిందిగా కోరడమైనది. అలా చేయడం ద్వారా ఇప్పుడు ఆరోగ్య రంగం మీద పెడుతున్న ఖర్చు తగ్గుతుందని తెలిపారు. చెవులకు పెట్టుకునే రింగులు అతి ప్రాచీనకాల అక్యూ పంక్చర్ అని, ఆభరణాలన్నీ ఆక్యు ప్రెషర్ సాధనాలని అని తెలిపి, వీటి వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయని, వీటి సైన్స్ యోగాతో జత చేయడం వల్ల యోగ బలపడుతుంది అని తెలిపారు. కాలేజీ విద్యార్థులకు, ఉద్యోగాలకు మోడీ హెల్త్ కేర్ స్టిక్కు పంచి వాటిని వాడుకునే విధం తెలిపారు. ముఖ్యఅతిథి డాక్టర్ మాకాల సత్యనారాయణ ను కాలేజీ యాజమాన్యం ఘనంగా సన్మానించింది. వైస్ ప్రిన్సిపాల్ సురేష్ ఇతర డిపార్ట్మెంట్ హెడ్స్ కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేశారు.

## వాట్సాప్ లో ఇకపై యాడ్స్!

డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది వినియోగిస్తున్న ప్రముఖ మెసేజింగ్ యాప్ వాట్సప్, తన సేవల్లో కీలక మార్పునకు శ్రీకారం చుడుతోంది. యాప్ ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి ప్రకటనలు లేకుండా ఉచితంగా సేవలు అందిస్తున్న ఈ సంస్థ, ఇప్పుడు ఆదాయ మార్గాలపై దృష్టి సారించింది. ఇందులో భాగంగా, త్వరలోనే వాట్సప్‌లో ప్రకటనలు దర్శనమివ్వనున్నాయని సంస్థ తన అధికారిక బ్లాగ్ పోస్ట్ ద్వారా వెల్లడించింది.

**అప్‌డేట్స్ ట్యాబ్‌లోనే యాడ్స్...** వినియోగదారులు ఎక్కువగా ఉపయోగించే వాట్సప్‌లోని 'అప్‌డేట్స్' ట్యాబ్‌లో ఈ ప్రకటనలు కనిపించనున్నాయి. ప్రస్తుతం ఈ ట్యాబ్‌లో ఉన్న ఛానెల్స్, స్టేటస్ విభాగాల్లో వీటిని ప్రవేశపెట్టనున్నారు. వాట్సప్ వెల్లడించిన వివరాల ప్రకారం, రోజూ సుమారు 150 కోట్ల మంది వినియోగదారులు ఈ అప్‌డేట్స్ ట్యాబ్‌ను చూస్తుంటారు. ఈ భారీ యూజర్ బేస్‌ను దృష్టిలో ఉంచుకుని, ఛానెల్ అడ్మిన్లు, వివిధ సంస్థలు, వ్యాపారులకు తమ ఉత్పత్తులు, సేవలను ప్రచారం చేసుకునేందుకు, తద్వారా వాట్సప్ ద్వారా ఎదిగేందుకు అవకాశం కల్పించాలనేది ఈ నిర్ణయం వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమని తెలుస్తోంది.

**మూడు రకాల యాడ్ ఫీచర్లు...** వాట్సప్ ప్రధానంగా మూడు రకాల ప్రకటన సంబంధిత ఫీచర్లను తీసుకురానున్నట్లు తెలిపింది. అవి:

1. ఛానెల్ సబ్‌స్క్రిప్షన్: వినియోగదారులు తమకు నచ్చిన ఛానెళ్లకు నెలవారీ రుసుము చెల్లించి మద్దతు తెలిపే సౌకర్యం.
2. ప్రమోటెడ్ ఛానెల్: ప్రస్తుతం ఛానెల్స్ విభాగంలో ట్రెండింగ్‌లో ఉన్న కొన్ని ఛానెళ్లు కనిపిస్తుంటాయి. ఇకపై, ఛానెల్ నిర్వాహకులు కొంత రుసుము చెల్లించి తమ ఛానెల్ ఎక్కువ మందికి కనిపించేలా (విజిబిలిటీ) ప్రమోట్ చేసుకోవచ్చు.
3. స్టేటస్‌లో యాడ్స్: ఇప్పటివరకు వ్యక్తుల స్టేటస్‌లు మాత్రమే కనిపించేవి. ఇకపై వ్యాపారాలకు సంబంధించిన స్టేటస్‌లు కూడా ఈ విభాగంలో దర్శనమిస్తాయి.

**వ్యక్తిగత చాట్స్‌కు మినహాయింపు...** అయితే, ఈ ప్రకటనలు కేవలం అప్‌డేట్స్ ట్యాబ్‌కు మాత్రమే పరిమితమవుతాయని వాట్సప్ స్పష్టం చేసింది. వినియోగదారుల వ్యక్తిగత చాట్స్, కాల్స్, మెసేజ్‌లు, వారు పెట్టుకునే స్టేటస్‌లు యథావిధిగా ఎలాంటి యాడ్స్ లేకుండా కొనసాగుతాయని, ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్‌తో సురక్షితంగా ఉంటాయని హామీ ఇచ్చింది. ప్రకటనల కోసం వినియోగదారుల దేశం, నగరం, వారు ఉపయోగించే భాష వంటి పరిమిత సమాచారాన్ని మాత్రమే సేకరిస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తుల ఫోన్ నంబర్లను అడ్వర్టైజర్లకు విక్రయించడం లేదా పంచుకోవడం జరగదని వాట్సప్ తేల్చి చెప్పింది. ఈ కొత్త యాడ్ ఫీచర్లను ఎప్పటి నుంచి అందుబాటులోకి తీసుకువచ్చేది వాట్సప్ ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. ఈ మార్పు వాట్సప్ వినియోగదారుల అనుభవాన్ని ఏమేరకు ప్రభావితం చేస్తుందో చూడాలి.

## మంత్రి నారా లోకేశ్ చొరవతోనే ఇది సాధ్యమైంది: గుంటూరు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్



మంగళగిరి, నేటి పత్రిక ప్రజావార్త : తెలుగుదేశం పార్టీ సంక్షేమానికి మారుపేరుగా నిలుస్తోందని గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ అన్నారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం నాడు ఆయన విలేకరులతో మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ప్రతి ఇంటా పండుగ వాతావరణం నెలకొందని తెలిపారు. పాఠశాలలు తెరిచిన తొలిరోజే 4.81 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.718.95 కోట్లు జమ చేశామని, విద్యార్థులకు స్కూల్ కిట్లు, బ్యాగులు అందించామని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ చొరవతో ఇది సాధ్యమైందని, ఇది ఒక రికార్డు అని కొనియాడారు. గత వైసీపీ ప్రభుత్వం పిల్లలను చదివించే విషయంలో నిర్లక్ష్యం వహిస్తే, ఈ పథకం ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యార్థులందరినీ చదివించాలని ప్రోత్సహిస్తున్నారని నసీర్ అహ్మద్ వివరించారు. 'తల్లికి వందనం' పథకాన్ని వైసీపీకి మరణశాసనంగా ఆయన అభివర్ణించారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో 'అమ్మఒడి' కింద రూ.24 వేల కోట్లు ఖర్చు చేస్తే, తమ కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలోనే 'తల్లికి వందనం' కోసం రూ.10,091 కోట్లు కేటాయించిందని వివరించారు. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంతమందికీ ఒక్కొక్కరికి రూ.13,000 చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నామని, కొందరు ఐదుగురు పిల్లలున్న తల్లులకు రూ.65,000, ఒక కుటుంబంలో 12 మంది పిల్లలకు రూ.1,56,000 కూడా జమ చేశామని నసీర్ అహ్మద్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఒక్కరికే పరిమితం చేసి మోసం చేసిందని ఆరోపించారు. పేదరికం లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా చంద్రబాబు 'పీ4' విధానాన్ని అమలు చేస్తున్నారన్నారు. ' గతంలో కేవలం 42 లక్షల మందికే 'అమ్మఒడి'అందిందని, తల్లికి వందనం' ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరుతోందని వివరించారు. మైనార్టీలకు కూడా కూటమి ప్రభుత్వంలో 54 శాతం అధికంగా ప్రయోజనం కలిగిందని తెలిపారు. జగన్ రెడ్డి పాలనలో రాష్ట్రం విధ్వంసం నుంచి నేడు అభివృద్ధి వైపు పయనిస్తోందని, సూపర్ సిక్స్ హామీల అమలుతో వైసీపీ నేతల్లో వణుకు మొదలైందని నసీర్ అహ్మద్ వ్యాఖ్యానించారు.

## రెండవ రోజు యోగాంధ్ర కార్యక్రమంలో భాగమైన 'మాక్సివిజన్'





విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నవారికి, చూడటానికి వచ్చినవారికి ప్రముఖ సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యఆసుపత్రి 'మాక్సివిజన్' రెండవ రోజు రాగి జావ, మంచినీరు పంపిణీ చేశారు. శుక్రవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాక్సివిజన్ ఏపీ క్లస్టర్ మేనేజర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ యోగాసనాల ద్వారా శరీరక మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతమైన జీవితాన్ని గడపగలుగుతారన్నారు. రక్తపోటు, మధుమేహం, కందరాలు, మోకాళ్ల నొప్పులు, స్త్రీలకు సంబంధించిన రుగ్మతుల నుండి యోగాసనాల ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగాసనాల సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. యోగా సాధనను ప్రపంచానికి చేరువచేయడంలో ప్రధాని మోడీ విజయవంతమయ్యారన్నారు. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగమైనందుకు చాలా ఆనందంగా వుందన్నారు. సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యఆసుపత్రి 'మాక్సివిజన్' ద్వారా 'సర్వేంద్రియానం నయనం ప్రధానం' అని చూపునిచ్చే కంటిని కాపాడుకుంటూ జాగ్రత్తగా చూసుకుంటే ప్రపంచాన్ని చూడగలమని నినాదాన్ని అందరికీ చాటిచెబుతున్నామన్నారు. నగరాలలోనే కాకుండా మారుమూల గ్రామాలలో సైతం కంటికి ఇబ్బందులను ఎదుర్కొనేవారికి సేవలు అందిస్తూ మా సంస్థ ద్వారా నమ్మకమైన అందుబాటు ధరలలో అత్యాధునిక విధానంలో వైద్యసేవలు అందిస్తూ భరోసా కల్పిస్తున్నామన్నారు. ఈ వైద్యసేవలు ఆరోగ్యశ్రీ, తదితరకార్డుల ద్వారా కూడా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాక్సివిజన్ సీనియర్ మార్కెటింగ్ మేనేజర్ భీమ, ఏపీ అకౌంట్స్ మేనేజర్ రాధాకృష్ణ, క్యాంప్ కో ఆర్డినేటర్లు మునేశ్వర్, రామాంజి, ప్రియాంక, రాజేశ్వరి, సునీల్, రాకేష్, నాగేశ్వరావు ఆసుపత్రికి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## "ఆరోగ్య" యూరాలజీ అండ్ గైనకాలజీ సెంటర్ హాస్పటల్ ప్రారంభం

*-ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్ హాజరు*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : రాజధాని అమరావతి ప్రాంతాన్ని మెడికల్ హబ్ గా తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యం. విజయవాడకు మరిన్ని హాస్పటల్స్ రావాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆకాంక్షించారు. విజయవాడ సూర్యారావు పేట ప్రకాశం రోడ్ లో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ ఎన్. సుబ్బారావు సెంటర్ ఫర్ కార్డియాక్ కేర్ హాస్పిటల్ ప్రారంభోత్సవం ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, కామినేని శ్రీనివాస్, కేర్ హాస్పటల్ ఎం.డి పద్మశ్రీ డాక్టర్.బి.సోమరాజుతో కలిసి ప్రారంభించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ నగరంలో డాక్టర్ ఎన్. సుబ్బారావు గొప్ప పేరున్న వైద్యులు అని, ఆయన పేరుమీద హాస్పిటల్ ఏర్పాటు చేసి ప్రారంభించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి లక్ష్యాల మేరకు విజయవాడ ను మెడికల్ హబ్ గా మార్చుకునేందుకు, యువ వైద్యులు ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే వైద్య సేవలు ప్రారంభించేందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. డాక్టర్ మురళీకృష్ణ తన కుటుంబంలోని వైద్యులతో కలిసి వైద్య రంగంలో అందుబాటులోకి వచ్చిన మోడల్ టెక్నాలజీతో నగరంలోనే హాస్పిటల్ ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ డాక్టర్ మురళీకృష్ణ ఆయన తండ్రి పేరిట హాస్పిటల్ ను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. ట్రీట్మెంట్ తో పాటు రోగులను ఆప్యాయంగా పలకరించాలని డాక్టర్ మురళీకృష్ణ కుటుంబం ఆ తరహా సేవలు అందిస్తారని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఇద్దరికే దండం పెడతారని ఒకరు వైద్యులు, మరొకరు వైద్యుడు అని పేర్కొన్నారు. ఈ హాస్పిటల్ ద్వారా మంచి సేవలు అందించాలని సూచించారు. ప్రభుత్వం తరుపున పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ లో డాక్టర్ ఎన్. సుబ్బారావు హాస్పిటల్ అంటే ఒక ల్యాండ్ మార్క్ అని చెప్పుకొచ్చారు. అలాంటి హాస్పిటల్ కు పూర్వ వైభవం తీసుకువచ్చేలా వారి మూడవ జనరేషన్ హాస్పిటల్ ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. సర్వీస్ తరహాలో ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని అభిప్రాయపడ్డారు. వైద్యులు లివింగ్ గాడ్స్ అని దేవుడు ప్రాణం ఇస్తే, వైద్యులు ప్రాణం పోస్తారని వెల్లడించారు. ఈ హాస్పిటల్ మంచి వైద్యసేవలు అందించి విజయవాడలో మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. డాక్టర్ మురళీ కృష్ణ మాట్లాడుతూ తమ హాస్పటల్లో యురాలజీ సమస్యలతో పాటు, గుండె జబ్బులకు సంబంధించిన అన్ని రకాల వైద్య సేవలు లభిస్తాయని తెలియజేశారు. నిష్ణాతులు అయిన వైద్యులు వైద్య సేవలు అందిస్తారని ఆధునిక పద్ధతులలో వైద్యం అందిస్తారని వివరించారు. రోబోటిక్ యూరో, అంకాలజీ హై రిస్క్ ప్రసవాలు ఆధునిక లేపరోస్కోపిక్ గైనకాలజీ సేవలు అందుబాటులో వున్నట్లు తెలిపారు. సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్.ఎన్.మురళీ కృష్ణ మాట్లాడుతూ తమ పిల్లలు కార్డియాలజిస్ట్ డాక్టర్ వరుణ్ నల్లమోతు , కార్డియాలజిస్ట్ డాక్టర్ పవన్ నల్లమోతు, యురాలజిస్ట్ డాక్టర్ మనోజ్ తుమ్మల, గైనకాలజిస్ట్ డాక్టర్ వర్షిణి తుమ్మల వైద్య సేవలు ప్రజలకు ఉపయోగపడాలని ఒపిడి సేవలు ప్రవేశపెట్టామని అన్నారు. పేద, మధ్య తరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న ఉద్దేశంతో వైద్యసేవలు ప్రారంభించామన్నారు. మెడికల్ నాలెడ్జ్ కి అంతు లేదని నిత్యవిద్యార్థి లా నేర్చుకుంటేనే ఉండాలని పేర్కొన్నారు. కేర్ హాస్పటల్ ఎం.డి పద్మశ్రీ డాక్టర్ సోమరాజు మాట్లాడుతూ డాక్టర్ మురళీకృష్ణ కుటుంబసభ్యులు వైద్య వృత్తిలో ఉండటం గర్వకారణమని అన్నారు. వైద్యం లో అనేక మార్పులు వచ్చాయని చాలా ట్రీట్మెంట్ లు డే కేర్ క్లినిక్ తరహాలో మారాయని ఇది శుభపరిణామం అన్నారు. అనారోగ్యం వచ్చాక ఆసుపత్రిలో చేరడం కాదని.. ఆ అనారోగ్యం దరిచేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ ఆసుపత్రిని దినదినాభివృద్ధి చెంది మంచి వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏపి, తెలంగాణ యురాలజీ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎ.వి.రవికుమార్, చెన్నై యురాలజీ అండ్ రోబోటిక్స్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ అనంతకృష్ణన్ శివరామన్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## డూండీ గణేష్ విగ్రహ శంఖుస్థాపన మహోత్సవ కార్యక్రమం

*-ముఖ్యఅతిథులుగా హాజరైన ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త :డూండి గణేష్ సేవాసమితి ఆధ్వర్యంలో లేబర్ కాలనీ మైదానంలో ఏర్పాటు చేయనున్న 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు సోమవారం జరిగిన శంఖుస్థాపన మహోత్సవానికి విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వీరికి డూండీ గణేష్ సేవాసమితి వ్యవస్థాపన అధ్యక్షుడు డూండీ రాకేష్ తో పాటు కమిటీ సభ్యులు సాదర స్వాగతం పలికారు. అనంతరం 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహ ఏర్పాటుకు కేశినేని వెంకట్, సినీ నటుడు సుమన్ పూజ కార్యక్రమాలు నిర్వహించిన కొబ్బరికాయలు కొట్టి శంకుస్థాపన చేయటంతోపాటు షెడ్డు నిర్మాణానికి కర్ర పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) తనయుడు కేశినేని వెంకట్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజల ఆకాంక్ష అయిన అమరావతి రాజధాని నిర్మాణానికి, రాష్ట్రాభివృద్ధికి ఎలాంటి విఘ్నాలు రాకుండా ఆ విఘ్నాధిపతి కాపాడాలని , రాష్ట్ర ప్రజలందరిపై ఆ మహా గణపతి ఆశీస్సులు వుండాలన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ లేని విధంగా 72 అడుగుల మహా మట్టి గణపతి విగ్రహం రాజధాని ప్రాంతంలో ఏర్పాటు చేయటం ప్రజలందరి అదృష్టమన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమం లో సినీ నటుడు సుమన్ తో కలిసి పాల్గొనటం చాలా సంతోషంగా వుందన్నారు. వినాయకచవితి కి అందరు మట్టి విగ్రహాలను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలందరూ ఎంతో సంతోషంగా వున్నారని తెలిపారు. అనంతరం సినీ నటుడు సుమన్ మాట్లాడుతూ ఖైరతాబాద్ వినాయక విగ్రహాన్ని మించిన ఎత్తులో మట్టి తో వినాయక విగ్రహం తయారు చేయటం చాలా గొప్ప విషయమన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించే విధంగా మట్టితో గణపతి విగ్రహాన్ని ఏర్పాటు చేయిస్తున్నందుకు డూండీ గణేష్ సేవాసమితికి అభినందనలు తెలిపారు. ఆర్యవైశ్య డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డూండీ గణేష్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డూండీ రాకేష్ మాట్లాడుతూ గతంలో 63 అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేయగా, గత నాలుగేళ్లుగా 72 అడుగుల మహామట్టి గణపతి విగ్రహాన్నిఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అమరావతి రాజధాని నిర్మాణం త్వరగా పూర్తిగా ఆ అభివృద్ధిని ప్రజలందరూ అందుకోవాలనే ఆకాంక్షతో 72 అడుగుల మహామట్టి గణపతి విగ్రహానికి భూమి పూజ శంకుస్థాపన చేయటం చాలా సంతోషంగా వుందన్నారు.అతిథులుగా విచ్చేసిన కేశినేని వెంకట్, సినీనటుడు సుమన్ కి కృతజ్ఞతలు తెలిపారు. మహామట్టి గణపతి పోస్టర్ లాంచ్ కార్యక్రమం త్వరలోనే వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డూండీ గణేష్ సేవాసమితి కమిటీ సభ్యులు గద్దం రవి, పేర్ల రవి, ముక్కేశ్వరరావు, డి.సుబ్బారావు, చైతన్య, నాగేశ్వరరావు, శ్రీనివాస్, సత్యనారాయణ, కార్పొరేటర్ ఉమ్మడి చంటి, డివిజన్ అధ్యక్షులు శివశర్మ, పేరం సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు రేగళ్ల లక్ష్మణరావు లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాయింట్ పట్టాదారులుగా భూ విభజన కోసం జూన్ 30 వరకు అవకాశం

*-విభజన కోసం చెల్లించాల్సిన రూ.500 రుసుము మాఫీ*

రాజమహేంద్రవరం, నేటి పత్రిక ప్రజావార్త : తూర్పు గోదావరి జిల్లాలో రీ-సర్వే పూర్తైన గ్రామాలలో వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు అయిన భూ యజమానులకు భూ విభజన కోసం దరఖాస్తు చేసుకునేందుకు జూన్ 30 వ తేదీ వరకు అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి గురువారం ఒక ప్రకటనలో తెలియచేసారు. జిల్లాలో రీ-సర్వే పూర్తి కాబడిన గ్రామముల యందు వెబ్ ల్యాండ్ 2.0 లో జాయింట్ పట్టాదారులుగా నమోదు కాబడిన భూ యజమానులు వారియొక్క భూములను విభజన చేయుటకు ప్రభుత్వంవారు నిర్దేశించిన 500 రూపాయల రుసుమును పూర్తిగా మినహాయించి ఉచితముగా ఈ సేవను పొందుటకు అవకాశము కల్పించడం జరిగిందన్నారు. ఇందు నిమిత్తం కేవలం నామమాత్రపు దరఖాస్తు రుసుము రూ.50 లను గ్రామ సచివాలయము నందు చెల్లించి జూన్ 30వ తేదీ లోపు దరఖాస్తు చేసుకొనవలసినదిగా కోరుచున్నాము. ఈ సదవకాశమును జాయింట్ పట్టదారులు అందరూ ఉపయోగించుకొని జాయింట్ పట్టాలను విడివిడిగా విభజన చేయించు కోవలసినదిగా తెలియ చేయడం జరిగింది. తద్వారా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకములైన "అన్నదాత సుఖీభవ" మరియు "తల్లికి వందనం" మరియు ఇతర ప్రభుత్వ సంక్షేమ పథకముల ప్రయోజనం పొందుటకు అర్హులుగా గుర్తించడం జరుగుతుందని తెలిపారు. "అన్నదాత సుఖీభవ" పథకములో ఇబ్బంది ఉన్నవారు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకుంటే వారికి తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు.

## ఆర్టీఈ కింద ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత నిర్బంధ ప్రవేశాల రెండో విడత లాటరీ ఫలితాలు విడుదల

*-సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు*

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విద్యాహక్కు చట్టం ప్రకారం 2025-26 విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో పేద విద్యార్థులకు కేటాయించిన 25శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించిన లాటరీ విధానంలో రెండో విడత ఫలితాలు తుది జాబితా శుక్రవారం (20.06.2025) విడుదల చేస్తున్నట్లు సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు IAS ఒక ప్రకటనలో తెలిపారు.ఒకటో తరగతిలో ప్రవేశాల దరఖాస్తులు మే 2 నుండి మే 19వరకు స్వీకరించిన సంగతి తెలిసిందే. దీనికి సంబంధించి 37,427 మంది పిల్లలు నమోదు చేసుకోగా తొలి విడత కింద అర్హత దశల ధ్రువీకరణ ద్వారా 28,561 మంది అర్హత సాధించారు. వీరిలో మొదటి విడత లాటరీలో 23,118 మందికి సీట్లు కేటాయించగా, 15,541 మంది పాఠశాలల్లో చేరారు. రెండో విడతలో భాగంగా మిగతా విద్యార్థులకు లాటరీ పద్ధతి ద్వారా ఎంపిక చేశామన్నారు. ఎంపికైన విద్యార్థుల సమాచారం తల్లిదండ్రుల మొబైల్ నంబర్లకు ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేయబడుతుంది. ఎంపిక వివరాలు ఈ రోజు (20.06.2025) https://cse.ap.gov.in/ వెబ్ సైట్ లో అందుబాటులో ఉంచుతామన్నారు. పాఠశాలలకు కేటాయించిన విద్యార్థులు తగిన ధ్రువీకరణ పత్రాలతో 30.06.2025 లోపు సంబంధిత పాఠశాలలకు వెళ్లి ప్రవేశాలను నిర్ధారించుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు టోల్ ఫ్రీ నంబర్ 18004258599 సంప్రదించవచ్చు.

## బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ మరియు సభ్యుల నియామకాలు..

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్ పర్సన్ మరియు సభ్యుల నియామకాల కోసం అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను స్వీకరణ తేదీ 2025, జూన్ 26 వరకు పొడిగించడమైనదని మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎమ్. వేణుగోపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 5వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్ లో విద్యార్హతలను పోస్ట్ గ్రాడ్యుయేషన్ గా సూచించామని దానిని గ్రాడ్యుయేషన్ కు సడలిస్తున్నామని ఆయన తెలిపారు. బాలలకు సంబందించిన రంగాలలో (విద్య, చట్టం, బాలల సంరక్షణ, జువైనల్ జస్టిస్) మొదలైన వాటిలో 10 సంవత్సరాలు అనుభవం ఉన్న గుర్తింపు పొందిన విశ్వ విద్యాలయం నుండి గ్రాడ్యుయేషన్ పొందిన ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను పంపించాలని అయన తెలిపారు. మరిన్ని వివరాలను http:/wdcw.ap.gov.in వెబ్ సైట్ లో లాగ్ ఇన్ అవ్వవలెనని డైరెక్టర్ వేణు గోపాల్ రెడ్డి తెలిపారు.

## డా.బి. ఆర్ అంబేద్కర్ గురుకులాల్లో 6, 7, 8, 9 వ తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 6, 7, 8, 9 వ తరగతుల్లో మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నాం. రేపటి నుంచి ఆయా పాఠశాలల్లో ఈ ధరఖాస్తులు స్వీకరిస్తారు. ధరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ఈ నెల 25వ తేదీ (25 జూన్ 2025 )పరీక్ష నిర్వహించడం జరుగుతుంది. ఎస్సి, ఎస్టీ, బీసీ వెనుకబడిన వర్గాల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలి. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీల వివరాలు.. 6 వ తరగతి - 3,095, 7 వ తరగతి - 1255, 8 వ తరగతి - 882, 9 వ తరగతి - 875

## ఎపిఇఆర్సి (APERC) లో సభ్యుని నియామకానికి ధరఖాస్తులు ఆహ్వానం

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమీషన్(ఎపిఇఆర్సి)లో సభ్యుని నియామకానికి సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుండి ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి(FAC) కె.విజయానంద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అర్హులైన అభ్యర్థులు వారి నామినేషన్లను 9-7-2025లోగా స్పెషల్ చీఫ్ సెక్రటరీ టు గవర్నమెంట్,ఇంధన శాఖ,గ్రౌండ్ ఫ్లోర్,బ్లాక్-2,ఎపి సెక్రటేరియట్,వెలగపూడి-522 238 అనే చిరునామాకు పంపాల్సి ఉంటుందని ఆయన తెలియజేశారు.ఇ-మెయిల్ అడ్రస్. Tappal-ene01@ap.gov.in. అదే విధంగా ఎపిఇఆర్సి సభ్యుని నియామకానికి సంబంధించిన ఎంపిక ప్రక్రియ, అర్హతలు తదితర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలు వెబ్ సైట్లు:www.ap.gov.in & www.aperc.gov.in లో అందుబాటులో ఉన్నట్టు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (ఎఫ్ఎసి) కె.విజయానంద్ తెలియజేశారు.

## "శ్రీ శ్రీ రవిశంకర్ పీస్ అండ్ వెల్నెస్ డే"



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : జాక్సన్విల్, ఫ్లోరిడా, జూన్ 16ను శ్రీ శ్రీ రవిశంకర్ పీస్ అండ్ వెల్నెస్ డే అని ప్రకటించింది. జాక్సన్విల్, ఫ్లోరిడా, గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ నిరంతర సేవను మరియు ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ సమాజంలో పరస్పర అవగాహన, ఐక్యత, స్వస్థత చేకూరుట కోసం చేస్తున్న నిరంతర ప్రయత్నాలను గౌరవిస్తూ, జూన్ 16 తేదీని అధికారికంగా "శ్రీ శ్రీ రవిశంకర్ పీస్ అండ్ వెల్నెస్ డే" అని ప్రకటించింది. ఈ ప్రకటనను జాక్సన్విల్ మేయర్, నార్త్ ఫ్లోరిడా యూనివర్సిటీలో జరిగిన ఒక కార్యక్రమంలో అధికారికంగా అందజేశారు. దీని ద్వారా, జాక్సన్విల్ ప్రపంచంలో "శ్రీ శ్రీ రవిశంకర్ దినోత్సవం"ను ప్రకటించిన 32వ నగరంగా నిలిచింది.

**బలమైన దృక్పథం తో జీవించే వ్యక్తి ఇతరులకు మార్గదర్శకమవుతాడు.**




# తెలంగాణ వార్తలు



## రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త!



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు శుభవార్తను అందించింది. రేపటి నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయనుంది. ఈ రోజు జరిగిన మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని మంత్రులకు సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల గురించి కూడా ముఖ్యమంత్రి చర్చించారు. జిల్లా నేతలతో ఇన్ఛార్జ్ మంత్రులు సమన్వయం చేసుకోవాలని ఆయన ఆదేశించారు.

**వైద్య కళాశాలలపై సీఎం రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు...** రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలు పూర్తి స్థాయి వసతులతో సమర్థవంతంగా పనిచేసేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న 34 వైద్య కళాశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఇటీవల రాష్ట్రంలోని 26 వైద్య కళాశాలల్లో ఉన్న సౌకర్యాలపై జాతీయ వైద్య మండలి (ఎన్ఎంసీ) అసంతృప్తి వ్యక్తం చేసిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఈ సమీక్ష నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రంలోని పలు మెడికల్ కళాశాలల్లో సదుపాయాల కొరత ఉందని గుర్తించిన జాతీయ వైద్య మండలి, ఈ విషయంపై వివరణ ఇచ్చేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ)లను ఈ నెల 18న ఢిల్లీకి రావాలని ఆదేశించింది. సంబంధిత కళాశాలల ప్రిన్సిపాల్స్ కూడా వర్చువల్ విధానంలో ఈ సమావేశంలో పాల్గొనాలని స్పష్టం చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కళాశాలల్లో క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనా వేసి, నివేదిక సమర్పించడానికి అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. ఆయా కళాశాలల్లో అవసరమైన అన్ని వసతులను రాబోయే మూడేళ్లలో సమకూర్చాలని సీఎం స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం విడుదల చేస్తుందని హామీ ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, అనుమతుల వివరాలను తనకు అందజేస్తే, కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాతో మాట్లాడి వాటిని త్వరితగతిన మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానని రేవంత్ రెడ్డి అధికారులకు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "నర్సింగ్ కళాశాలల్లో జపనీస్ భాషను ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా నేర్పించాలి. జపాన్‌లో మన నర్సింగ్ సిబ్బందికి మంచి డిమాండ్ ఉంది, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి" అని సూచించారు. వైద్య, విద్య శాఖలకు సంబంధించిన అంశాలపై ప్రతి నెలా మూడో వారంలో తప్పనిసరిగా సమీక్షా సమావేశం నిర్వహించాలని ఆయన దిశానిర్దేశం చేశారు.

## హైదరాబాద్‌లో గూగుల్ సంస్థకు మా 'వాళ్లే' పోటీ!: సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైటెక్ సిటీలో గూగుల్ సెక్యూరిటీ ఇంజినీరింగ్ సెంటర్ 2 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, దానికి సమీపంలోనే ఇందిరా మహిళా శక్తి సెంటర్ మూడున్నర ఎకరాల్లో ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ మహిళలు గూగుల్‌కు గట్టి పోటీ అని ఆయన సరదాగా వ్యాఖ్యానించారు. బుధవారం హైదరాబాద్‌లో గూగుల్ సంస్థ ఏర్పాటు చేసిన సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను (జీఎస్ఈసీ) ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రపంచం వేగంగా డిజిటల్ యుగం వైపు పయనిస్తోందని, ఈ నేపథ్యంలో డిజిటల్ సమాచార భద్రత ఎంతో కీలకమని ఆయన పేర్కొన్నారు. ప్రజల డిజిటల్ సమాచారం సురక్షితంగా ఉన్నప్పుడే వారు క్షేమంగా ఉన్నట్లు భావించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో గూగుల్ సేఫ్టీ ఇంజినీరింగ్ సెంటర్‌ను ప్రారంభించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. డిజిటల్ భద్రతను పెంపొందించడమే ఈ కేంద్రం యొక్క ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. "గూగుల్ ఒక ఇన్నోవేటివ్ కంపెనీ, మా ప్రభుత్వం కూడా ఇన్నోవేటివ్‌గానే పని చేస్తుంది. రాష్ట్రంలో యువత నైపుణ్యాలను పెంచేందుకు ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశాం" అని ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రం పెట్టుబడులకు ఉత్తమ గమ్యస్థానంగా మారుతోందని, అందుకు తమ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలే కారణమని వివరించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతి లక్ష్యాలను కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా ప్రస్తావించారు. "2035 నాటికి తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. 'తెలంగాణ రైజింగ్' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని వెల్లడించారు. "ఇక్కడి మహిళలు కేవలం లబ్ధిదారులుగా మిగిలిపోకుండా, ధనిక పెట్టుబడిదారులకు దీటైన పోటీదారులుగా ఎదుగుతున్నారు. ప్రభుత్వంలో ఎప్పటికప్పుడు నూతన ఆవిష్కరణలు, వినూత్న విధానాలు తీసుకొస్తున్నాం" అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారు.

**బ్రిటన్ మాజీ ప్రధానితో భేటీ కానున్న రేవంత్ రెడ్డి**

ఇంగ్లండ్ మాజీ ప్రధానమంత్రి టోనీ బ్లెయిర్‌తో రేపు రేవంత్ సమావేశం కానున్నారు. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడంపై చర్చించనున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. టోనీ బ్లెయిర్ ప్రస్తుతం 'టోనీ బ్లెయిర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్లోబల్ చేంజ్ (టీబీఐ)' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. ఈ సంస్థ ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకుంటోంది. ఈ నేపథ్యంలో, టీబీఐ ద్వారా తెలంగాణ రాష్ట్రానికి అందగల సహకారం, పెట్టుబడుల అవకాశాలపై రేవంత్ రెడ్డి చర్చలు జరిపే వీలుంది. ఈ ఢిల్లీ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలతో కూడా సమావేశం అవుతారని తెలుస్తోంది. పార్టీలో ఇంకా భర్తీ కాకుండా పెండింగ్‌లో ఉన్న పదవులు, నామినేటెడ్ పోస్టుల భర్తీ వంటి కీలకమైన సంస్థాగత అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానంతో ఆయన చర్చించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వీటితో పాటు, పలువురు కేంద్ర మంత్రులను కూడా కలిసి, రాష్ట్రానికి సంబంధించిన వివిధ అభివృద్ధి అంశాలపై వినతిపత్రాలు సమర్పించి, చర్చించే వీలుందని సమాచారం.

## ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో తెలుగు మహోత్సవం

*ఆధ్యాత్మికత, సాంస్కృతిక విలువల అనన్య సమ్మేళనం*



బెంగళూరు, నేటి పత్రిక ప్రజావార్త : ప్రముఖ ఆధ్యాత్మిక గురువు, మానవతావాది గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ సన్నిధిలో, ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో నిర్వహించిన తెలుగు మహోత్సవం ఒక విభిన్నమైన ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక పండుగగా మారింది. ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల నుండి 500 మందికి పైగా పాల్గొనగా, ఆహారం, సంప్రదాయాలు, జ్ఞానం మరియు సంస్కృతి కలయికగా ఈ మహోత్సవం నిలిచింది. విశేషంగా, 68 రకాల స్వీట్లు ఉన్న ఫుడ్ ఫెస్టివల్ స్థానిక వంటకాల్లోని విభిన్నతను ప్రతిబింబించింది. గత కొన్ని దశాబ్దాలుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ భారతీయ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటానికి నిబద్ధతతో పనిచేస్తోంది. ఈ సందర్భంలో కూడా ప్రాంతీయ కళాకారుల ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ మహోత్సవం నిలిచింది. స్వాగత కార్యక్రమంలో బతుకమ్మ మరియు కొలాటం వంటి సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించబడ్డాయి. సురభి రెడ్డి మరియు శిలా శ్రీలు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం, వేమన శతకాల శ్లోకాలతో అనుసంధానమై, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మహోత్సవ సమయంలో ఆశ్రమం మొత్తం ఆంధ్ర, తెలంగాణ సంస్కృతి రంగుల్లో ఒదిగిపోయింది. నాలుగు రోజుల పాటు సాగిన ఈ ఉత్సవంలో పాల్గొన్నవారు ఆధ్యాత్మిక సాధనల ద్వారా లోతైన ఆనందం, ప్రశాంతతను అనుభవించారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొని, ప్రకృతి మాధుర్యాన్ని ఆస్వాదించారు. సుదర్శన్ క్రియా, యోగ మరియు ధ్యానం వంటి ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వారు ఆత్మానందాన్ని పొందారు.పాల్గొన్నవారు ప్రధానంగా అనంతపురం, కర్నూలు, కడప, ఒంగోలు, విజయవాడ, హైదరాబాద్, కరీంనగర్, శ్రీకాకుళం, వరంగల్, రాజమండ్రి వంటి ప్రాంతాల నుంచి వచ్చారు. డా. వినోద్, విజయవాడ ఆంధ్ర హాస్పిటల్‌లో చీఫ్ అనస్థీషియాలజిస్ట్ మరియు క్రిటికల్ కేర్ నిపుణుడు మాట్లాడుతూ... "నేను వైద్య విద్యార్థిగా ఉన్నప్పుడు మొదటిసారి ఆర్ట్ ఆఫ్ లివింగ్ కోర్సు చేశాను. గత 22 ఏళ్లుగా వైద్యుడిగా పనిచేస్తూనే, సుదర్శన్ క్రియ వంటి ఆర్ట్ ఆఫ్ లివింగ్ సాధనలను కూడా నిత్యం చేయడం వల్ల నా జీవితంలో చాలా శాంతి మరియు శక్తిని పొందాను. గురుదేవ్ శ్రీ శ్రీ రవిశంకర్ గారిని ఈసారి కలవడం ఒక భావోద్వేగభరితమైన అనుభవంగా మారింది. ప్రపంచవ్యాప్తంగా 800 మిలియన్ల మందికి ఆనందాన్ని పంచి, ఒత్తిడి లేకుండా జీవించేందుకు మార్గం చూపిన గురుదేవ్ నన్ను కూడా ఇతరుల కోసం మరిన్ని చేయడానికి ప్రేరేపిస్తున్నారు."

ఇక మరో వైద్య నిపుణురాలు, ప్రసూతి నిపుణి డా. లక్ష్మీ కుమారి, డా. వినోద్ అభిప్రాయాన్ని అనుసరిస్తూ, ఆమె తన రోగులకు సైతం ఆర్ట్ ఆఫ్ లివింగ్ హ్యాపీనెస్ ప్రోగ్రాంను సిఫారసు చేస్తానని పేర్కొన్నారు. ఇది మానసిక, నరాల, హార్మోనల్ మరియు భావోద్వేగ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఈ సారి ప్రత్యేకంగా, ఆదివాసీ బృందం కూడా మొదటిసారిగా ఆశ్రమానికి హాజరైంది. వారి అభివృద్ధి, సంస్కృతి పరిరక్షణ కోసం ఆర్ట్ ఆఫ్ లివింగ్ చేపట్టిన అనేక ప్రాజెక్టుల ఫలితంగా వారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వారు ప్రదర్శించిన ధింసా మరియు బదువా నృత్యాలు, అరకు లోయ మరియు లంబసింగి ప్రాంతాలకు చెందిన ప్రత్యేకమైన సంప్రదాయ నృత్యాలు, ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేశాయి.

## అక్రమ నిర్మాణాలు.. కూల్చివేతలు: హైదరాబాద్ మున్సిపల్ అధికారులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : హైదరాబాద్ నగరంలో అక్రమ నిర్మాణాల విషయంలో మున్సిపల్ అధికారుల వైఖరిపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. భవన నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు అధికారులు ఏం చేస్తున్నారని, ఆ సమయంలో కళ్లు మూసుకుని వ్యవహరిస్తారా అంటూ ఘాటు వ్యాఖ్యలు చేసింది. సోమవారం, శేరిలింగంపల్లి, గుట్టల బేగంపేట ప్రాంతానికి చెందిన ఒక భవన నిర్మాణదారుడు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది."కోర్టు ఏదైనా ఆదేశాలు జారీ చేసిన తర్వాత మీరు స్పీకింగ్ ఆర్డర్ ఇస్తారు. ఈలోగా అక్కడ భవన నిర్మాణం మొత్తం పూర్తయిపోతుంది. ఆ తర్వాత కూల్చివేత పేరుతో డ్రామా మొదలుపెడతారు" అంటూ అధికారుల తీరుపై మండిపడింది.ప్రాంతాల వారీగా పర్యవేక్షణకు అధికారులు ఉన్నప్పటికీ అక్రమ నిర్మాణాలు ఎలా సాధ్యమవుతున్నాయని హైకోర్టు ప్రశ్నించింది. "పన్నులు వసూలు చేసేటప్పుడు మాత్రం ఆ భవనం వివరాలన్నీ మీకు కచ్చితంగా తెలుస్తాయి. కానీ, అక్రమంగా నిర్మిస్తున్నప్పుడు మాత్రం మీ దృష్టికి రాదా?" అని నిలదీసింది. ఇలాంటి నిర్లక్ష్య వైఖరి వల్లనే అక్రమ కట్టడాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని అభిప్రాయపడింది.ప్రస్తుత పిటిషన్‌కు సంబంధించి, బిల్డింగ్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (బీఆర్ఎస్)పై ప్రభుత్వం నిర్ణయం తీసుకునేంత వరకు యథాతథ స్థితిని కొనసాగించాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం, ఈ కేసు తదుపరి విచారణను వచ్చే నెలకు (జులై) వాయిదా వేసింది.

## కేటీఆర్ కు మద్దతుగా నిలిచిన కవిత



తెలంగాణ, నేటి పత్రిక ప్రజావార్త : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు ఆయన సోదరి, ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మద్దతుగా నిలిచారు. ఫార్ములా-ఈ కార్ రేసింగ్ వ్యవహారంలో ఏసీబీ చేపట్టిన విచారణ నేపథ్యంలో ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌ను లక్ష్యంగా చేసుకుని ఈ విచారణ జరుగుతోందని, ప్రధాన సమస్యల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇటువంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆమె ఆరోపించారు. "ఏ పార్టీలోనైనా లోపాలుంటే అధినేత దృష్టికి తీసుకెళ్లడం సహజం. అంతమాత్రానికే దాన్ని భూతద్దంలో చూడాల్సిన పనిలేదు. మా పార్టీలోని లోపాలను మేం సరిదిద్దుకుంటాం. మాపై ఎవరైనా దాడి చేస్తే ఊరుకోబోం" అని స్పష్టం చేశారు. తమ పార్టీ కార్యకర్తలను, నేతలను బయటకు రాకుండా అడ్డుకోవడం దారుణమని ఆమె మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసాను కేవలం ఒకసారే, అదీ 60 శాతం మంది రైతులకే అందించిందని కవిత విమర్శించారు. "మిగిలిన 40 శాతం మంది రైతులకు ఎప్పుడు రైతు భరోసా ఇస్తారో ప్రభుత్వం స్పష్టం చేయాలి. గత యాసంగిలో ఇచ్చినట్టు మూడు ఎకరాల లోపు భూమి ఉన్నవారికే ఇస్తారా, లేక రైతులందరికీ వర్తింపజేస్తారా అనే దానిపై ప్రభుత్వం నుంచి స్పష్టత కొరవడింది" అని ఆమె మండిపడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు రైతులకు, ప్రజలకు ఇచ్చిన అనేక హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు.

## ఆరోగ్య ఉపద్రవాలను అధిగమించటానికి మోడీ ఫిట్నెస్ మంత్ర

*-యోగ శక్తి సాధనా సమితి*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలోని వి ఆర్ సిద్ధార్థ కాలేజ్ ఆడిటోరియంలో జరిగిన 'మోడీ ఫిట్నెస్ మంత్ర'ఎక్స్పర్ట్ టాక్ లో పాల్గొన్న యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్ని ఉపద్రవాలు వచ్చినా జనం తట్టుకుని నిలబడే లాగా మోడీ ఫిట్నెస్ మంత్ర ఉందని,దీనిని ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలి అని కోరతున్నారు. రేపటి ప్రపంచం ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలంటే భారత యోగాతోనే సాధ్యమని తెలిపారు.యోగాంధ్రాను ప్రారంభించడానికి విచ్చేస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ గారికి స్వాగతం చెబుతూ,మంచి కార్యక్రమాన్ని ఆంధ్రులకు అందిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం సారధి నారా చంద్రబాబు నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.ప్రాణ శక్తి గురించి వివరంగా తెలుసుకుని చేతుల నుండి, అరికాళ్ళ నుండి,చెవుల నుండి, ప్రాణాయామం మరియు మెడిటేషన్ నుండి పునః శక్తివంతం కావటం గురించి వందలాదిమంది విద్యార్థులు, కళాశాల ఉద్యోగులకు తర్ఫీదు ఇచ్చినట్లు డాక్టర్ మాకాల సత్యనారాయణ తెలిపారు.కళాశాల యాజమాన్యం అద్భుత సమాచారము ఇచ్చిన యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ ను ఘనంగా సన్మానించింది.

## ఎస్సీ, ఎస్టీ లకు ఉచిత ఉపాధి శిక్షణ

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విశాఖపట్నం కంచరపాలెం బాలికల ఐటిఐ ప్రాంగణంలోని నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్ ఆధ్వర్యంలో జూలై ఒకటో తేదీ నుండి ప్రరంభంకానున్న 2025-26 ఉచిత కోర్సులకు ఎస్సీ, ఎస్టీ చెందిన అభ్యర్థుల నుండి ధరఖాస్తులను స్వీకరించబడును. కేంద్ర ప్రభుత్వ ఉపాధి, లేబర్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఈ శిక్షణను ఏడాది పాటు ఉచితంగా అందించబడును. స్పెషల్ కోచింగి స్కీమ్ (కాంపిటేటివ్ ఎగ్జామ్స్ కు), ఓ లెవెల్ కంప్యూటర్ సాఫ్ట్ వేయర్, ఓ లెవెల్ కంప్యూటర్ హార్డ్ వేయర్ కోర్స్ లలో శిక్షణ అందించబడున. శిక్షణ కాలంలో, ఎంపికైన వారికి నెలకి రూ. వెయ్యి స్టైఫండ్ అందించబడును. ఆశక్తి, అర్హత గల వారు దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా https://dbtscst.ncs.gov.in/users/signup లేదా NCSC ఆఫీస్ కు వచ్చి రుజువు పత్రాలతో అప్లై చేయవలను. అభ్యర్థులు కనీసం ఇంటర్మీడియట్ / 10+2 చదివియుండవలను. కుటుంబ ఆదాయం మూడు లక్షలు మించరాదు. వయసు జూలై ఒకటో తేదీకి 18 నుండి 27 (స్పెషల్ కోచింగి స్కీమ్), 18 నుండి 30 (ఓ లెవెల్) ఉండవలను. జూన్ 30న ధరఖాస్తు ఆఖరు తేదీ. పూర్తి వివరముల కొరకు వెంటనే 0891-2788700, https://dge.gov.in లేదా http://ncsc.gov.in లేదా ncs.vizag/facebook సందర్శించవలెను.

## తల్లికి వందనం నిధుల విడుదలపై తల్లుల సంతోషం

*సెంట్రల్ నియోజకవర్గంలో సీఎం చిత్రపటానికి పాలాభిషేకం*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : తల్లికి వందనం పథకం కింద సెంట్రల్ నియోజకవర్గంలోని మహిళల ఖాతాల్లో నిధులు జమ కావడంతో ఆనందోత్సాహంగా స్పందించిన మహిళలు సీఎం చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బోండా ఉమా మహేశ్వరరావు పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా సెంట్రల్ నియోజకవర్గ మహిళ కార్యదర్శి అవుటుపల్లి విజయ కుమారి ఆధ్వర్యంలో పలువురు మహిళలు సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. పథకం అమలులో భాగంగా ఇద్దరు పిల్లలుంటే రూ. 26,000, ముగ్గురు పిల్లలుంటే రూ. 39,000 చొప్పున నిధులు మహిళల ఖాతాల్లో జమయ్యాయి. స్కూల్స్ ప్రారంభమైన రోజునే ఈ నగదు అందడంతో తల్లుల సంతోషానికి అవాధులు లేకుండా పోయింది. గత ప్రభుత్వం పాలనలో ఏడాది తరబడి బకాయిలతో తల్లులు ఇబ్బందులు పడిన సందర్భాలు గుర్తు చేస్తూ%ళొ% ఇప్పుడిలా వేగంగా నిధులు చేరడం రాష్ట్రంలోని సాంకేతికంగా మెరుగైన పాలనకు నిదర్శనమని మహిళలు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మహిళలు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు చేపట్టిన తల్లికి వందనం పథకం కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా నిలబెట్టే శక్తిగా నిలుస్తుందని తెలిపారు. ఈ పథకాన్ని నిర్వాహక స్థాయిలో విజయవంతంగా అమలు చేస్తున్న ఎమ్మెల్యే బోండా ఉమాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అవుటుపల్లి విజయ కుమారి మాట్లాడుతూ "బాలికా విద్యను ప్రోత్సహించేందుకు, తల్లుల కష్టానికి మర్యాద ఇవ్వాలనే సీఎంకు సంకల్పానికి ఇది ప్రత్యక్ష ఫలితం. మేమంతా కృతజ్ఞతలతో పాలాభిషేకం చేసి మన ఆనందాన్ని వ్యక్తపరచుకున్నాం," అని పేర్కొన్నారు.

## యోగ ప్రాణమయ కోశాతో అర్థంతర చావుల నివారణ

*-యోగ శక్తి సాధన సమితి*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలోని మెరిస్టెల్లా కాలేజీ ఆవరణలో (కోవే ) కాన్ఫిడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రప్రెన్యూర్ కార్యాలయము నందు జరిగిన కార్యక్రమానికి రాష్ట్ర కార్యదర్శి కానూరు విజయలక్ష్మి అధ్యక్షత వహించగా, ఆంధ్ర ప్రదేశ్ ఖాది విలేజ్ ఇండస్ట్రీస్ చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ వి రవికుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. పి ఎం మోడీ ఫిట్నెస్ మంత్ర అవగాహన కార్యక్రమాన్ని యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ నిర్వహిస్తూ 'యోగ ప్రాణమయ కోశాను'వాడకం ద్వారా అర్ధంతర చావులు తగ్గించవచ్చునని తెలిపారు. మోడీ ఫిట్నెస్ మంత్రాలోని బేర్ ఫుట్ వాక్, చేతి ఆక్యుప్రెషర్, చెవుల మర్దన, ప్రాణాయామ మరియు మెడిటేషన్ ఎలా చేయాలో నేర్పి, ఇలాంటి ప్రాణ శక్తి పెరగటం తో అర్ధంకర చావులు తగ్గుతాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్నవారికి ప్రపంచవ్యాప్తంగా చేస్తున్న సిపిఆర్ ఆక్యుప్రెషర్ విభా గానికి, ప్రాణ శక్తి పెంపుకు సంబంధించినదే అని ఇలాంటి భారతీయ వైద్యాన్ని ప్రపంచవ్యాప్తంగా వాడుతున్న డాక్టర్స్ కు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మోడీ ఫిట్నెస్ మంత్ర కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రచారానికి సహకరించవలసిందిగా డాక్టర్స్ ను కోరాటమైనది. ముఖ్యఅతిథి రాష్ట్ర ఖాది ఇండస్ట్రీస్ సీ ఎ ఓ రవికుమార్ మాట్లాడుతూ ఇండస్ట్రీస్ డెవలప్ చేసుకునే వారికి సర్టిఫికెట్లు, సబ్సిడీలు, శిక్షణ అందిస్తామని చెప్పి మోడీ ఫిట్నెస్ మంత్ర అందరికీ మంచిదని, జీవితకాలం వాడుతూ ఆరోగ్యంగా ఉండమని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ ఇండస్ట్రీస్ వారు, కోవే మరో కార్యదర్శి సుశీల, మాజీ ప్రెసిడెంట్ రాజమణి అడ్వైజరీ బోర్డ్ మాలతి, హెూమియో డాక్టర్ స్వాతి మరియు స్టాఫ్ పాల్గొన్నారు.

## వియంసి ఇంచార్జ్ కమిషనర్ డి.చంద్రశేఖర్‌కి వినతిపత్రం..: వేముల జైపాల్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : నగరంలోని అలంకార్ సెంటర్ ధర్నాచౌక్‌లో నిరసన దీక్ష చేపట్టి నేటికీ 46 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావటం లేదని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షుడు వేముల జైపాల్ ఆధ్వర్యంలో విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్‌కి తమ సమస్యలపై వినతిపత్రాన్ని శుక్రవారం అందజేశారు. మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 46వ రోజు కొనసాగుతున్న నిరసన దీక్షలో భాగంగా వేముల జైపాల్ విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల గోడు పట్టించుకోకుండా ప్రభుత్వం వేడుక చూస్తుందన్నారు. చాలీచాలని జీతాలతో ఎంతకాలం పని చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలని, తక్కువ జీతంలో కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులకు తక్షణం సంక్షేమ పథకాలు అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అంతా ఏకమై రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షలకు కూడా వెనకాడబోమని హెచ్చరించారు. మా న్యాయమైన కోర్కెలు తీర్చాల్సి బాధ్యత మున్సిపల్ కార్పొరేషన్, ప్రభుత్వం వారిదేనన్నారు. ఇప్పటికైనా స్పందించాలని అర్థించారు. ఈ కార్యక్రమంలో వి.రాము, పి.బుచ్చిబాబు, స్ట్రీట్ లైట్ దుర్గారావు, కమిటీ సభ్యులు, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...: వేములు జైపాల్



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నిరసన దీక్ష చేపట్టి నేటికీ 45 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించేందుకు ముందుకు రావటం లేదని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ నగర ఉపాధ్యక్షుడు వేములు జైపాల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం, అలంకార్ సెంటర్ ధర్నాచౌక్ లో మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో 45వ రోజు కొనసాగుతున్న నిరసన దీక్షలో భాగంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల గోడు పట్టించుకోకుండా ప్రభుత్వం వేడుక చూస్తుందన్నారు. చాలీచాలని అరాకొరా జీతాలతో ఎంతకాలం పని చేయాలని ప్రభుత్వాన్ని నిలదీశారు. పెరిగిన రేట్లతో వచ్చే జీతాలు సరిపడక కుటుంబాలను పోషించుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదనపడ్డారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీతాలు పెంచాలని, తక్కువ జీతం లో కొనసాగుతున్న మున్సిపల్ కార్మికులకు తక్షణం సంక్షేమ పథకాలు అమలు జరపాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆప్కోస్ విధానంలో పనిచేస్తున్న కార్మికులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తమ సమస్యల పరిష్కరించకుంటే తదుపరి కార్యాచరణలో భాగంగా కలెక్టరేట్ల ముట్టడి, కుటుంబ సభ్యులతో కలిసి నిరసనలు చేపడతామన్నారు. చాలని జీతాలతో కష్టాలతో కొట్టుమిట్టాడుతున్న తమకు చావంటే భయం లేదని, నిరసన దీక్షలో భాగంగా చావడానికైనా వెనుకాడబోమని, రాష్ట్రంలో ఉన్న మున్సిపల్ ఇంజనీరింగ్ వర్కర్స్ అంతా ఏకమై రాష్ట్రవ్యాప్తంగా నిరాహార దీక్షలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నిరసనదీక్షలో కార్మికులు సాంబ నాగరాజు, స్ట్రీట్ లైట్ దుర్గారావు,బుచ్చిబాబు,కమిటీసభ్యులు,మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ శాఖలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి




విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : పంచాయతీరాజ్ శాఖలోని ఇంజనీరింగ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామ సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు విజయవాడ ధర్నా చౌక్ లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ఆఫ్ సెక్రటేరియట్ ఇంజనీర్స్ రాష్ట్ర అధ్యక్షులు బి.షణ్ముఖ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.శంకర్రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ అసిస్టెంట్ లపై తీవ్రమైన పని భారాన్ని పంచాయతీరాజ్ శాఖలోని ఎనిమిది ఇంజనీరింగ్ శాఖల పనులను ఇంజనీర్ అసిస్టెంట్ లపై ప్రభుత్వం మోపుతుందని ఆరోపించారు. ఒక ఇంజనీర్ అసిస్టెంట్కు ఒక శాఖ మాత్రమే కేటాయించాలని కోరుతున్నామన్నారు. ఇప్పటికే తమ సమస్యలపై పలుమార్లు మంత్రులను అధికారులను కలిసి విన్నవించిన పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు పదోన్నతులు కల్పించాలన్నారు. తమ సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సానుకూలంగా స్పందించి పరిష్కరించాలని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలో 26 జిల్లాల నుండి ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటీటీలో ఐశ్వర్య రాజేష్ మూవీ చూసితీరవలసిందే!




సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :తెలుగు .. తమిళ భాషలలో ఐశ్వర్య రాజేశ్ కి ఎంతో క్రేజ్ ఉంది. తమిళంలో ఆమె చేసిన సినిమాలలో కొన్ని ఓటీటీలో ఒక రేంజ్ లో దూసుకుపోతున్నాయి. అలాంటి సినిమాల జాబితాలో 'సొప్పన సుందరి' ఒకటిగా కనిపిస్తుంది. ఎస్. జి. చార్లెస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా, 2023లో థియేటర్లకు వచ్చింది. ఆ తరువాత హాట్ స్టార్ ఓటీటీ ఫ్లాట్ ఫామ్ పైకి వచ్చింది. విశాల్ చంద్రశేఖర్ నేపథ్య సంగీతాన్ని అందించిన ఈ సినిమా, ఓటీటీ వైపు నుంచి ఆడియన్స్ మనసులను కొల్లగొడుతూనే ఉంది. బ్లాక్ కామెడీ జోనర్లో వచ్చిన ఈ సినిమా, మొదటి నుంచి చివరివరకూ నవ్విస్తూనే ఉంటుంది. కథ విషయానికి వస్తే .. అహల్య – రాణి అక్కా చెల్లెళ్లు. ఇద్దరూ పెళ్లిళ్లకు సిద్ధంగా ఉంటారు. అనారోగ్యంతో మంచం పట్టిన తండ్రి .. డబ్బు ఆశగల తల్లి .. భార్యమాట వినేసి ఇంట్లో నుంచి వెళ్లిపోయిన అన్నయ్య .. ఇది వాళ్ల పరిస్థితి. అహల్య ఒక జ్యుయలరీ షాపులో పనిచేస్తూ ఉంటుంది. ఆ షాపువారు లక్కీ డ్రా క్రింద 10 లక్షల ఖరీదు చేసే కారును ప్రకటిస్తారు. తన యజమాని పంపించగా ఆ షాపులో గోల్డ్ తీసుకున్న అహల్య అన్నయ్య, రాయడం రాని కారణంగా కూపన్ ను ఆమెకి ఇస్తాడు. తన పేరును రాసిన అహల్యకి లక్కీ డ్రాలో ఆ కారు తగులుతుంది. అహల్య ఆ కారును కట్నంగా ఇచ్చి రాణి పెళ్లి చేయాలనుకుంటుంది. అయితే ఆ పెళ్లికొడుకు రాణితో పాటు ఆ కారులో వెళ్లి యాక్సిడెంట్ చేస్తాడు. ఆ వ్యక్తి చనిపోవడంతో శవాన్ని డిక్కీలో పెడతారు. నగలు కొన్నది తాను గనుక కారు తనదే అంటూ అహల్య పైకి అన్నయ్య గొడవకు వస్తాడు. దాంతో డిక్కీలో శవం ఉందని తెలియని పోలీసులు ఆ కారు తీసుకుని స్టేషన్ కి వెళతారు. నగలు కొన్న రసీదు ఎవరు చూపిస్తే వాళ్లకి కారు అప్పగిస్తామని అంటారు. అప్పుడు అహల్య ఏం చేస్తుంది? ఆ తరువాత ఏమౌతుంది? అనేది కథ.

## మోడీ ఫిట్నెస్ మంత్ర ఇంటింటి ప్రచారానికి డాక్టర్ల సహకారం కోరిన యోగ శక్తిసాధనా సమితి

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : 11 వ అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలలో భాగంగా ఈరోజు డాక్టర్ నోరి రామ శాస్త్రి ఆయుర్వేద కాలేజీలో జరిగిన 'పీఎం మోడీ ఫిట్నెస్ మంత్ర 'అవగాహన సదస్సును కాలేజీ వైస్ ప్రిన్సిపాల్



నిర్మల జ్యోతి భాయ్ సభకు అధ్యక్షత వహించారు. యోగ శక్తి సాధన సమితి వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ మాకాల సత్యనారాయణ మాట్లాడుతూ మోడీ ఫిట్నెస్ మంత్ర ఇంటింటి ప్రచారానికి డాక్టర్ల సహకారం అభ్యర్థించారు. మోడీ ఫిట్నెస్ మంత్ర యోగ ఆకుప్రెషర్ విభాగానికి చెందినదని, ఇది భారత సనాతన వైద్య విభాగానికి ప్రతీక అని తెలిపారు. దీని ద్వారా ప్రాణ శక్తి పెరగటం, అంతర పంచభూతాలు సమస్థితి ఏర్పడడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, దీనితో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేవని, త్వరితగతిన ఫలితాలు కూడా ఉంటాయని డాక్టర్ మాకాల తెలిపారు. ఆయుర్వేదం కూడా ఇలాంటి ఫలితాలు మరియు భారత సనాతన వైద్యం అని ప్రపంచవ్యాప్తంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని తెలిపారు. డాక్టర్ విజయ శాంతి కుమారి మాట్లాడుతూ డాక్టర్ మాకాల చాలా మంచి సమాచారం ఇచ్చారు అని తెలిపి కృతజ్ఞతలు తెలిపారు. ఆయుర్వేద కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయి సుధాకర్ పర్యవేక్షణ చేసారు మరియు ఆయుష్ డిపార్ట్మెంట్ పర్మిషన్ తో కార్యక్రమం జరిగింది.

## మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం ధరఖాస్తు చేసుకున్న విద్యార్థిని విద్యార్థుల కు రాత పరీక్ష

విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : కృష్ణ మరియు ఎన్టీఆర్ జిల్లా లోని డా.బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలల్లో 6,7,8,9 వ తరగతుల్లో మిగిలిన సీట్ల అడ్మిషన్ల కోసం ధరఖాస్తు చేసుకున్న విద్యార్థిని విద్యార్థుల కు బాలురకు కృష్ణరావు పాలెం, బాలికలకు కుంటముక్కల లో రాత పరీక్ష తేదీ 25.06.2025 నిర్వహించడం జరుగుతుంది. మరియు 5వ తరగతి నందు పరీక్ష రాసిన విద్యార్థులు కు బాలికలకు కుంటముక్కల లో 22.06.2025 మరియు బాలురకు కృష్ణరావు పాలెం నందు 23.06.2025 స్పాట్ అడ్మిషన్ నిర్వహించడం జరుగుతుంది మరియు ఇంటర్మీడియట్ నందు పరీక్ష రాసిన విద్యార్థులు కు బాలికలకు కుంటముక్కల లో 26.06.2025 మరియు బాలురకు కృష్ణరావు పాలెం నందు 27.06.2025 స్పాట్ అడ్మిషన్ నిర్వహించడం జరుగుతుంది స్పాట్ అడ్మిషన్ ప్రవేశ పరీక్ష రాసిన విద్యార్థిని విద్యార్థులకు మాత్రమే గమనించగలరు ఈ అవకాశాన్ని సద్వినియోగ%శీ% చేసుకోగలరు అని జిల్లా సమన్వయ అధికారి ఏ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలియజేసారు.

## స్వరరాగావధానం తెలుగువారి మహత్తర శక్తి

*-డల్లాస్‌లో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్*



అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : స్వరరాగావధానం ప్రక్రియ తెలుగువారి మహత్తర శక్తి అని విశ్వ హిందీ పరిషత్ అధ్యక్షుడు, పద్మ భూషణ్ ఆచార్య. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అమెరికా –డల్లాస్‌లో తానా–టాంటెక్స్ సంయుక్త ఆధ్వర్యంలో అడుసుమిల్లి రాజేష్, దేవినేని పరమేష్ సమన్వయంలో గరికపాటి ప్రభాకర్‌చే స్వరరాగావధానం తెలుగు సాహితీ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ అవధానం తెలుగువారి సంపద అన్నారు. సాహిత్య అవధాన ప్రక్రియ తిరుపతి వేంకట కవులు, కొప్పరపు కవుల ద్వారా విశేష ప్రాచుర్యంలోకి వచ్చిందని, సంగీతం ద్వారా రాగాలను ఆధారం చేసుకుని స్వరరాగావధానం పేరిట సరికొత్తగా అవధాన ప్రక్రియను తీసుకు రావడం అభినందించదగ్గ విషయమని కొనియాడారు. గరికపాటి ప్రభాకర్ ఈ ప్రక్రియను బహుళ ప్రాచుర్యంలోకి తీసుకుని వచ్చి, శిష్య బృందాన్ని తయారు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డా.తోటకూర ప్రసాద్ పాల్గొన్నారు.

## 'రాజాసాబ్' వీడియోతో హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసుల పోస్ట్.. సోషల్ మీడియాలో వైరల్!



హైదరాబాద్, నేటి పత్రిక ప్రజావార్త : ప్రస్తుతం సినీ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న పేరు 'రాజాసాబ్'. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇటీవల విడుదలైన టీజర్ ఇంటర్నెట్‌లో సంచలనం సృష్టిస్తోంది. ముఖ్యంగా ప్రభాస్ తన పాత చిత్రాల్లో కనిపించిన తరహాలో హాస్యభరితమైన పాత్రలో కనిపిస్తుండటం, అద్భుతమైన విజువల్ ఎఫెక్ట్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ఈ టీజర్ క్రేజ్‌ను హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు వినూత్నంగా ఉపయోగించుకున్నారు. ఈనెల 16న 'రాజాసాబ్' టీజర్ తెలుగుతో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. తెలుగు టీజర్‌లోని 'బండి కొంచెం మెల్లగా', 'అసలే మన లైఫ్ అంతంతమాత్రం' వంటి డైలాగులు సోషల్ మీడియాలో పాప్యులర్ అయ్యాయి. ఈ పాప్యులారిటీని సద్వినియోగం చేసుకుంటూ హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిన్న ఒక ప్రత్యేక అవగాహన వీడియోను రూపొందించి విడుదల చేశారు. ఈ వీడియోలో ప్రజలకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించడానికి ప్రభాస్ డైలాగులను చాలా తెలివిగా ఉపయోగించారు. ప్రభాస్ నటించిన 'సాహో' చిత్రంలోని "ఇట్స్ షో టైమ్" అనే డైలాగుతో వీడియో మొదలవుతుంది. ఆ వెంటనే, మితిమీరిన వేగంతో వెళ్తున్న ఒక బైక్ దృశ్యం కనిపిస్తుంది. అప్పుడు 'రాజాసాబ్' టీజర్‌లోని "హలో హలో బండి కొంచెం మెల్లగా" అనే డైలాగ్ వినిపిస్తుంది. దీనికి కొనసాగింపుగా, 'మిర్చి' సినిమాలో ప్రభాస్ నెమ్మదిగా బైక్‌పై వెళ్తున్న సన్నివేశాన్ని జోడించారు. ఆ తర్వాత 'రాజాసాబ్'లోని "అసలే మన లైఫ్ అంతంతమాత్రం" అనే డైలాగ్ ప్లే అవుతుంది. చివరగా 'మిర్చి' సినిమాలోని ప్రభాస్ హెల్మెట్ తీస్తున్న సన్నివేశాన్ని చూపిస్తూ, "హెల్మెట్ ధరించండి, నెమ్మదిగా వెళ్లండి" అనే స్పష్టమైన సందేశాన్ని ప్రజలకు అందించారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో ఈ వీడియోను పోస్ట్ చేశారు. దీనికి HYDTP weBring Awareness అనే హ్యాష్‌ట్యాగ్‌తో పాటు "హలో... హలో....! బండి కొంచెం మెల్లగా డ్రైవ్ చేయండి డార్లింగ్" అని పేర్కొన్నారు. ఈ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇక, ప్రముఖ దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'రాజాసాబ్' చిత్రం రొమాంటిక్ హారర్ కామెడీ జానర్‌లో ఫాంటసీ అంశాలతో రూపుదిద్దుకుంటోంది. ఈ సినిమాను ఈ ఏడాది డిసెంబర్ 5న విడుదల చేయనున్నట్లు చిత్ర యూనిట్ ప్రకటించింది. వాస్తవానికి ఈ సినిమా ముందుగానే విడుదల కావాల్సి ఉన్నప్పటికీ, భారీ విజువల్ ఎఫెక్ట్స్ కారణంగా ఆలస్యమైందని నిర్మాత టీజీ విశ్వప్రసాద్ ఇటీవల ఒక సందర్భంలో తెలిపారు. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. తమన్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

## యోగాంధ్ర కార్యక్రమంలో భాగమైన 'మాక్సివిజన్'



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : విజయవాడ బీఆర్‌టీఎస్ యోగాస్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నవారికి, చూడటానికి వచ్చినవారికి ప్రముఖ సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యఆసుపత్రి 'మాక్సివిజన్' రాగి జావ, మంచినీరు పంపిణీచేశారు. బుధవారం జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ మేనేజర్ భీమ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, యోగాసనాల సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందన్నారు. యోగా సాధనను ప్రపంచానికి చేరువచేయడంలో ప్రధాని మోదీ విజయవంతమయ్యారన్నారు. ఆరోగ్య ఆంధ్ర లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగమైనందుకు చాలా ఆనందంగా వుంద న్నారు. సూపర్ స్పెషాలిటీ కంటి వైద్యఆసుపత్రి 'మాక్సివిజన్' ద్వారా 'సర్వేంద్రి యానం నయనం ప్రధానం' అని చూపునిచ్చే కంటిని కాపాడుకుంటూ జాగ్ర త్తగా చూసుకుంటే ప్రపంచాన్ని చూడగలమని నినాదాన్ని అందరికీ చాటిచెబు తున్నామన్నారు. నగరాలలోనే కాకుండా మారుమూల గ్రామాలలో సైతం కంటికి ఇబ్బందులను ఎదుర్కొనేవారికి సేవలు అందిస్తూ మా సంస్థ ద్వారా నమ్మకమైన అందుబాటు ధరలలో అత్యాధునిక విధానంలో వైద్యసేవలు అందిస్తూ భరోసా కల్పిస్తున్నామన్నారు. ఈ వైద్యసేవలు ఆరోగ్యశ్రీ, తదితర కార్డుల ద్వారా కూడా అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి జనరల్ మేనేజర్ ప్రదీప్‌కుమార్, ఏపీ అకౌంట్స్ మేనేజర్ రాధాకృష్ణ, క్యాంప్ కోఆర్డినేటర్లు మునేశ్వర్ రామాంజి, ఆసుపత్రికి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మన జీవిత పుస్తకంలోని ప్రతి పేజీలో యోగా ఉండాలి

*విజయవంతంగా 30వ రోజు యోగాంధ్ర: కలెక్టర్ డా. జి.లక్ష్మీశ*



విజయవాడ, నేటి పత్రిక ప్రజావార్త : మన జీవిత పుస్తకంలోని ప్రతి పేజీలో యోగా ఉండాలని.. ప్రతి ఒక్కరూ కామన్ యోగా ప్రోటోకాల్ యోగాను జీవన విధానంలో భాగం చేసుకోవాలని కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. గురువారం విజయవాడ బీఆర్‌టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ పాల్గొని వార్డు సచివాలయాల ప్లానింగ్ కార్యదర్శులు, యోగా ఔత్సాహికులతో కలిసి యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సుసంపన్న, ఆరోగ్య, ఆనంద ఆంధ్రాకు తొలి అడుగు యోగాంధ్ర అని.. 30 రోజులుగా జిల్లాలో గ్రామగ్రామాన, పట్టణాల్లో యోగా శిక్షణ కార్యక్రమాలు విజయవంతంగా జరుగుతున్నాయన్నారు. శరీరంలోని అన్ని వ్యవస్థలకు నూతన ఉత్తేజాన్ని ఇచ్చే శక్తి యోగాసనాలకు ఉందని, ఒత్తిడిని మన జీవితంలోకి అడుగుపెట్టనివ్వకుండా యోగాసనాలు రక్షణ కవచాల్లాగా పనిచేస్తాయన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లోనూ ప్రతిరోజూ యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ డా. డి.చంద్రశేఖర్, ఎన్‌సీసీ జిల్లా సమన్వయకర్త డా. కె.రమేష్, ఫిజికల్ డైరెక్టర్ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## 'కూలీ' ఫస్టు రికార్డు అదే అవుతుందట!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త : రజనీకాంత్ ను ఎప్పటికప్పుడు మరింత కొత్తగా చూపించడానికి కుర్ర దర్శకులంతా పోటీ పడుతున్నారు. ఆ జాబితాలో ఇప్పుడు లోకేశ్ కనగరాజ్ వంతు వచ్చేసింది. రజనీకాంత్ తో ఆయన రూపొందించిన 'కూలీ' గురించే ఇప్పుడు అంతా మాట్లాడుకుంటున్నారు. కమల్ వంటి సీనియర్ స్టార్ కి 'విక్రమ్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ ఇచ్చిన లోకేశ్, రజనీతో చేసే మేజిక్ ఎలా ఉంటుందో చూడటానికి అభిమానులంతా వేయి కళ్లతో వెయిట్ చేస్తున్నారు. యాక్షన్ థ్రిల్లర్ జోనర్లో నిర్మితమైన ఈ సినిమాకి, కళానిధి మారన్ నిర్మాతగా వ్యవహరించాడు. దాదాపు 350 కోట్ల రూపాయలతో ఈ సినిమాను నిర్మించినట్టుగా వినికిడి. దేశ విదేశాలలో రజనీకి గల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసిన పనిలేదు. ఆయన గత చిత్రాల కంటే ఎక్కువగా ఈ సినిమాకి బిజినెస్ జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. విదేశీ పంపిణి హక్కులకి సంబంధించి 70 – 80 కోట్లు చెల్లించడానికి కొన్ని బడా సంస్థలు సిద్ధంగా ఉన్నాయట. అయితే నిర్మాత కళానిధి మారన్ అంతకుమించిన రేటు చెబుతున్నారని సమాచారం. విదేశీ రైట్స్ 80 కోట్లు దాటితే, ఈ సినిమా ఫస్టు రికార్డు అదే అవుతుందని అంటున్నారు. నాగార్జున .. ఉపేంద్ర .. శృతిహాసన్ ముఖ్యమైన పాత్రలను పోషించిన ఈ సినిమా, ఆగస్టు 14న థియేటర్లకు రానుంది.

## ఓటీటీలో ఊపిరి బిగబట్టేలా చేసే మలయాళ థ్రిల్లర్!



సినిమా డెస్క్, నేటి పత్రిక ప్రజావార్త :తెలుగు ప్రేక్షకులను మలయాళ సినిమాలకు మరింత దగ్గర చేసింది ఓటీటీనే అని చెప్పాలి. ఓటీటీలలో వచ్చే మలయాళ సినిమాలు మంచి మార్కులు సంపాదించుకోవడమే అందుకు కారణమని చెప్పుకోవచ్చు. అలా ఇప్పుడు మలయాళం నుంచి మరో సినిమా తెలుగు ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఆ సినిమా పేరే 'కొల్లా' .. 'కొల్లా' అంటే 'దోపిడీ' అని అర్థం. 'కొల్లా' సినిమా మలయాళంలో 2023లో జూన్ 9వ తేదీన థియేటర్లకు వచ్చింది. ఆ తరువాత మలయాళంలోనే ఈ సినిమా అమెజాన్ ప్రైమ్ లో స్ట్రీమింగ్ కి వచ్చింది. అలాంటి ఈ సినిమా ఇప్పుడు 'ఈటీవీ విన్' ద్వారా ప్రేక్షకుల ముందుకు రావడానికి రెడీ అవుతోంది. ఈ నెల 19వ తేదీ నుంచి ఈ సినిమా తెలుగులోను అందుబాటులోకి రానుంది. ఈ సినిమాలో రజీషా విజయన్ – ప్రియా ప్రకాశ్ వారియర్ ప్రధానమైన పాత్రలను పోషించారు. ఈ ఇద్దరి చుట్టూనే ఈ కథ తిరుగుతుంది. ఇద్దరికీ కూడా పెద్ద మొత్తంలో డబ్బు అవసరమవుతుంది. బ్యాంక్ దోపిడీ చేయడం తప్ప మరో మార్గం లేదని భావిస్తారు. అందుకోసం వాళ్లు ఎలాంటి ప్రయత్నాలు చేస్తారు? ఎలాంటి పరిణామాలను ఎదుర్కుంటారు? అనేది కథ.

## అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడడం కూడా నేరమే... అది మర్చిపోవద్దు: పవన్ కళ్యాణ్

అమరావతి, నేటి పత్రిక ప్రజావార్త : రాష్ట్రంలో అప్రజాస్వామికంగా వ్యవహరించేవారిని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిని ఉపేక్షించబోమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. అటువంటి వారిని ప్రజలు నిశితంగా గమనించాలని, అసాంఘిక శక్తుల పట్ల ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని ఆయన హెచ్చరించారు. వైసీపీ అధినేత జగన్ సినిమా డైలాగులతో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పవన్ కళ్యాణ్ గురువారం మీడియా ద్వారా స్పందించారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలను కట్టడి చేయకపోగా, వాటిని సమర్థించేలా మాట్లాడే వారి నేరపూరిత ఆలోచనలను ప్రజలు గమనించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. అసాంఘిక శక్తులకు మద్దతుగా మాట్లాడటం కూడా నేరమేనన్న విషయాన్ని ఎవరూ మరచిపోరాదని ఆయన స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో అందరూ సంయమనం పాటించాలని, రెచ్చగొట్టే వ్యాఖ్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సినిమాల్లో చెప్పే డైలాగులు సినిమా హాళ్ల వరకే బాగుంటాయని, వాటిని నిజ జీవితంలో అమలుచేస్తామంటే ప్రజాస్వామ్యంలో కుదరదని ఆయన హితవు పలికారు. చట్టం, నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాల్సిందేనని నొక్కిచెప్పారు.



ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్నవారు మరింత జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించేలా ప్రవర్తించే అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపాలని పోలీసులకు ప్రభుత్వం ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిని కూటమి ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించదని, అవసరమైతే రౌడీషీట్లు తెరిచి అలాంటి వారిని అదుపులోకి తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

**Printed, Published and Owned by KONDURI SRINIVASARAO, Printed at M/s Arunodaya Note Book Manufacturers Pvt. Ltd., D.No:33-5-9, Papaiah Street, Seetharampuram, VIJAYAWADA, Krishna District, Andhra Pradesh and Published from H.No:24-9/1-148, Ramanagar, Ramakoti Maidanam, Bavajipeta 1st Line Cross, VIJAYAWADA 520 003, Krishna District, Andhra Pradesh.**
**Editor : Konduri Srinivasarao, RNI Title code No : APTEL 2021/80559, Phone No : 9948877444, Email id : konduri9999@gmail.com.**